# వార్త

ఆదివారం

21 మే, 2023



# మరుగుతున్న ఈశాన్యం











# సెప్టెంబరులో 'ఖుషి' సినిమా విడుదల!

ప్రేమకథా చిత్రాల స్పెషలిస్టుగా శివ నిర్వాణకి మంచి పేరు ఉంది. ఆయన తెరకెక్కించిన 'నిన్ను కోరి', 'మజిలీ' సినిమాలను ప్రేక్షకులు ఇంకా మరిచిపోలేదు. ఆయన దర్శకత్వంలో ఇప్పుడు 'ఖుషి' పేరుతో మరో ప్రేమకథ ముందుకు రానుంది. ఈ సినిమాలో సమంత-విజయ్ దేవరకొండ జంటగా నటించారు. 'మహానటి' చిత్రంలో కలిసి నటించిన ఈ జోడీ ఇప్పుడు పూర్తి స్థాయిలో హీరో, హీరోయిన్స్‌గా కనిపించనున్నారు. 'మజిలీ' హిట్ తరువాత శివ నిర్వాణతో కలిసి సమంత చేస్తున్న సినిమా ఇది.

మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మించిన ఈ సినిమాను తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో సెప్టెంబరులో విడుదల చేయనున్నారు.

---

# బన్నీ, త్రివిక్రమ్‌ల కాంబినేషన్‌లో కొత్త చిత్రం?

గతంలో బన్నీ, త్రివిక్రమ్‌ల కాంబినేషన్‌లో వచ్చిన 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'ఇల వైకుంఠపురములో' సినిమాలు సంచలన విజయం సాధించాయి. హ్యాట్రిక్ అందుకున్న తరువాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో మరో ప్రాజెక్టు ఎప్పుడు వస్తుందా? అని అభిమానులు ఎదురు చూస్తున్నారు.

ఆ దిశగా ప్రయత్నాలు మొదలైనట్లుగా ఆ మధ్య టాక్ వచ్చింది. మహేశ్‌బాబుతో సినిమా పూర్తి కాగానే బన్నీతోనే త్రివిక్రమ్ సెట్స్ పైకి వెళ్లనున్నట్లు సమాచారం. ఆ తరువాత బన్నీ చేసే ప్రాజెక్టులు బోయపాటితోను, సురేందర్ రెడ్డితోను ఉన్నట్టు తెలుస్తోంది.

మొత్తానికి బన్నీ స్టార్ డైరెక్టర్స్‌ను రిపీట్ చేసే పనిలో ఉన్నాడన్నమాట!



ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
21 మే, 2023

## మంచి ముత్యాలు

ప్రకృతికి విధేయులమై ఉన్నప్పుడే
దానిని మనం ఆజ్ఞాపించగలం.

- ఫ్రాన్సిస్ బేకన్

## విషయ విశేషం


ముత్యాల హారం... 4

'సంఘీ'భావం....5

ఆందోళనకర రీతిలో విద్యార్థుల ఆత్మహత్యలు

కవర్ స్టోరీ..6

మరుగుతున్న
ఈశాన్యం

తక్కువ ధరకే పుస్తకాలు..11

ఈవారం కవిత్వం..12

హైటెక్ అభివృద్ధి

కథ.. 20

అక్షర దక్షిణ

దళిత ఉద్యమ వైతాళికులు..ధర్మన్న....24

గృహిణులు తలచుకుంటే..! ...25

అదేదో సామెత చెప్పినట్టు....30

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

నవ్వుల్ రువ్వుల్

వగైరా..వగైరా..


# తాజా వార్తలు

## ఉచితంగా పాలు



పాలధరలు నానాటికీ పెరిగిపోతున్నాయి. మరోవైపు కల్తీలేని పాలు దొరకటమే గగనమవుతోంది. అదే గుజరాత్‌లోని కచ్ జిల్లా డోక్డా గ్రామానికి వెళితే కల్తీలేని స్వచ్ఛమైన పాలనీ, పెరుగునీ, నెయ్యినీ ఉచితంగా ఇస్తారు. ఎందుకంటే ఈ ఊళ్లో పాలూ, పాల పదార్థాలూ అమ్మితే పాపమని భావించి ఆ గ్రామంతోపాటు చుట్టుపక్కల పల్లెల్లో పాడిలేని వారికి ఫ్రీగా అందిస్తుంటారు. ప్రజల్లో ఆ నమ్మకం బలపడటానికి కారణం పీర్‌సైయద్నా అనే సూఫీ సాధువు అయిదువందల ఏళ్ల క్రితం డోక్టాకు వచ్చాడట. ఈ ఊళ్లో ప్రజలు సంతోషం, ప్రశాంతత ఉండాలంటే పాలను అమ్ముకోవద్దని చెప్పాడట. అప్పట్నుంచీ గ్రామస్తులు పాలూ, పాలపదార్థాలు అమ్మడం మానేశారట. కొన్నేళ్ల క్రితం డోక్టాకు అల్లుడుగా వచ్చిన ఓ వ్యక్తి అక్కడి ఆచారాన్ని కాదని పాల అమ్మకం ప్రారంభించాడు. కొన్ని నెలల్లోనే అతను చనిపోవడంతో పాలను అమ్మకూడదనే డోక్టా వాసుల నమ్మకం ఇంకా బలపడిపోయింది. దాంతో వ్యవసాయ పనులకోసం పశువుల్ని పెంచుకుంటున్నవారంతా లీటర్ల కొద్దీ కల్తీలేని పాలను గ్రామస్తులకూ, పొరుగు ఊళ్లకూ ఉచితంగా ఇస్తున్నారు.


### కోతుల కోసం 35 ఎకరాలు

మహారాష్ట్రలోని ఉప్లా గ్రామస్తులు కోతులకు తినేందుకు ఏదో ఒకటి పెట్టేవారట. క్రమంగా ఎవరింట్లో పెళ్లి, ఇతర శుభకార్యాలూ జరిగినా వాటికే ముందుగా ఆహారం పెట్టడం అలవాటు చేసుకున్నారు. ముందుచూపుతో ఆలోచించి ఆ గ్రామస్థుల పూర్వికులెవరో వాటికి ఊళ్లో దాదాపు 35 ఎకరాల భూమిని రాసిచ్చారు. గతేడాది రెవెన్యూరికార్డులు తిరగేస్తున్న అధికారులకు ఆ విషయం తెలిసి విస్తుపోయారు. గ్రామానికి వెళ్లి చూస్తే ఇప్పటికీ రకరకాల పళ్లచెట్లతో కోతులకు కడుపునింపుతోంది ఆ భూమి. అటవీ అధికారుల పర్యవేక్షణలో ఉన్న ఆ స్థలంలో పాడుపడిన ఇల్లు కూడా ఉందట.



కోతుల కోసం అడవిలా మారిన ఆ ఖరీదైన స్థలాన్ని స్వార్థప్రయోజనాల కోసం వాడుకోకూడదని మూగజీవాలకే వదిలేసారు.








# ముత్యాల హారం





విలువైన రాళ్లు ఎన్ని ఉన్నప్పటికీ, నవరత్నాలన్నింటిలోనూ అమ్మమ్మల కాలం నుంచీ అతివలకు బాగా దగ్గరైంది ముత్యాలే అన్నది అందరికీ తెలిసిందే. ఎలాంటి పసిడి కాంతుల జత లేకుండా వాటికున్న సహజమైన నిగారింపుతోనే కనువిందుచేశాయి. ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కోరుకునే మగువల కోసం అన్ని ఫ్యాషన్లలాగే ఆభరణాలూ మారాలిగా అనుకున్న బంగారు నిపుణులు.. ముత్యాలతోను అందమైన నగల్ని తయారు చేస్తున్నారు. మీవద్ద ఉన్న బంగారానికే కొన్ని ముత్యాల్ని కలిపారంటే కొత్తనగ మీవంటిపై వాలిపోతుంది. ఈ ముత్యాలే కాకుండా రైస్ పెరల్స్ పేరుతో అందుబాటులో ఉన్న చిట్టిచిట్టి మల్లెమొగ్గల్లాంటి ముత్యాలు ఈ నగల్లో మరింత ప్రత్యేకంగా కలిసిపోతున్నాయి. ముత్యాలదండకు మ్యాచింగ్ దిద్దులూ పెట్టుకుంటే అందరికళ్లు మీవైపు ఉంటాయి.

'సంఘీ' భావం



# ఆందోళనకర రీతిలో విద్యార్థుల ఆత్మహత్యలు

ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగిన విద్యార్థుల ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. పరీక్షా ఫలితాలు వెలువరించే సమయంలో ప్రభుత్వ అధికారులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ముందుగా విద్యార్థులు ఎట్టిపరిస్థితుల్లోను ఆత్మహత్యలు చేసుకోవద్దని కోరుతున్నారంటే పరిస్థితి ఎంత ఆందోళనకరరీతిలోఉందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల్లో ఆశించినమేర మార్కులు రాకపోయినా, ఉత్తీర్ణత సాధించలేకపోయినా మనస్తాపంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం అనేది ఎప్పటి నుంచో కొనసాగుతోంది. అయితే తాజాగా గత ఆరేడు సంవత్సరాలుగా ఈ సంఖ్య పెరగడం అన్ని వర్గాల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. మారుతున్న సమాజంలో పోటీతత్వం గణనీయంగా పెరిగిపోయింది. మూడు, నాలుగు దశాబ్దాల క్రితం విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడం గొప్పగా ఉండేది. పరీక్ష పాస్ అయితే చాలన్న భావన చాలామందిలో ఉండేది. ఆ తరగతి ఉత్తీర్ణత సాధించి పై క్లాస్‌కు వెళితే ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసేది. అయితే పరిస్థితులు మారాయి. విద్య వ్యాపారంగా మారింది. తల్లిదండ్రుల ఆశలు ఆకాశానికి ఎగబాకాయి. విద్యాసంస్థలు విద్యార్థుల పాలిట శాపంగా పరిణమించాయి. వందకు వంద మార్కులు రావాలన్న తపన పెరిగింది. రోజుకు 12 నుంచి 14 గంటలు చదివించడం ఫ్యాషన్‌గా మారింది. ఇష్టంతో కాకుండా కష్టంతో విద్యను భరించాల్సిన పరిస్థితులు దాపురించాయి. దీనికి అనుగుణంగా సున్నితమైన విద్యార్థుల మనసు మారకపోవడంతో ఆత్మహత్యలు శరణ్యంగా మారుతున్నాయి. నేషనల్ క్రైం రికార్డ్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదిక ప్రకారం ప్రతి రోజూ సుమారు 35 మంది విద్యార్థులు తీవ్ర మానసిక ఆందోళనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తోటివారి నుంచి ఎదురయ్యే పోటీ, ఒంటరితనం, భవిష్యత్తుపై మితిమీరిన అంచనాలు, ఒత్తిడి, ఆందోళనలు వంటివి విద్యార్థులను వెంటాడుతున్నాయి. 2021లో 10,732 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటే 2022 నాటికి అది 12 వేలకు చేరింది. దేశంలోనే అత్యున్నత విద్యా సంస్థగా పేర్కొనే సెంట్రల్ యూనివర్శిటీలో ఏకంగా గత మూడు నెలల్లో 9 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దేశంలో అత్యంత అధికంగా పోటీతత్వంతో కూడిన విద్యావిధానం, ఉపాధి కోసం పరిమిత అవకాశాలు విద్యార్థులను ఆత్మహత్యకు ప్రేరేపిస్తున్నాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. తల్లిదండ్రుల అంచనాలు, ఆర్థిక పరిమితులు, బెదిరింపులు, సంబంధాల సమస్యలు, ఆహ్లాదంగా ఉండని విద్యాసంస్థల ఆవరణలు, కుల, మత, ప్రాంతీయతత్వ వాతావరణం నెలకొనడం వంటి అనేక సమస్యలు విద్యార్థులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. పరీక్షల్లో ఆశించిన ఫలితాలు సాధించలేకపోయిన విద్యార్థులు అపరాధ భావంతో కృంగిపోవడం, అవమానంగా భావించడం, తోటి విద్యార్థులు, సమాజం తమను ఎగతాళి చేస్తారని, వాటిని తాము ఎదుర్కోలే మన్న భావన పెరిగినప్పుడు సున్నిత మనస్కులైన విద్యార్థులు ఆత్మహత్యల పట్ల మొగ్గుచూపుతారని మానసిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మన దేశంలో వివిధ రకాలైన వైద్యులు అందుబాటులో ఉంటారు. కాని మానసిక వైద్య నిపుణులు చాలా తక్కువగా ఉన్నారు. ప్రస్తుత గణాంకాల ప్రకారం లక్ష మందికిఒక మానసిక వైద్య నిపుణుడు ఉన్నారు. ఇది కూడా కేవలం అభివృద్ధి చెందిన నగరాల్లో మాత్రమే. ఇతర ప్రాంతాల్లో పది లక్షల మందికి ఒక్కరు కూడా లేరు. నగరాల్లో నిపుణులైన మానసిక వైద్యనిపుణులు ఉన్నా వారి ఫీజులు అందుబాటులో ఉండటం లేదు. ఇతర రోగాలు వస్తే కన్సల్టెంట్ ఫీజు కింద డాక్టర్లు వంద నుంచి 5 వందల రూపాయలు వసూలు చేస్తారు. అయితే మానసిక వైద్యనిపుణులు ఏకంగా నాలుగు వేల నుంచి 6 వేల రూపాయలను వసూలు చేస్తున్నారు. మానసిక సమస్యలు వచ్చినప్పుడు సైక్రియాటిస్ట్ వద్దకు వెళ్లాలి అన్న భావన రావడమే చాలా తక్కువగా ఉంటోంది. అవగాహన ఉన్న విద్యార్థులు కౌన్సెలింగ్ వెళ్లాలన్న దిశగా ఆలోచించినా ఫీజులు అందుబాటులో లేక తమ ప్రయత్నాన్ని విరమించుకుంటున్నారు. విద్యార్థుల ఆత్మహత్యల సమస్యను నివారించేందుకు ఒక సమగ్ర వ్యూహాన్ని అనుసరించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పోటీతత్వం, మార్కులతో సరిపోల్చే విధానం, బట్టీపట్టి పరీక్షలకు హాజరు అయ్యే పరిస్థితి, విద్యాభ్యాసం సమయంలో చదవడం మినహా ఇతరత్రా వినోద, మనోవికాస కార్యక్రమాలు లేకపోవడం వంటి వాటితో కూడిన విద్యావిధానాన్ని సమూలంగా మార్పులు చేయాలి. విద్యార్థులకు మానసిక ఆరోగ్య పరిస్థితులను అందు బాటులోకి తీసుకురావడం, అవగాహన కల్పించడం వంటివి చేయాలి. ప్రధానంగా విద్యాశాఖలో సైక్రియాటిస్ట్‌లను నియమించాల్సిన అవసరం ఉంది. కనీసం పది విద్యాసంస్థలకు ఒకరిద్దరు సైక్రియాటిస్ట్‌లను నియమించి విద్యార్థులతో చర్చావేదికలు వంటివి ఏర్పాటుచేయాలి. విద్యార్థి తీవ్రవత్తిడికి గురౌతున్నట్లు భావిస్తే వెంటనే సైక్రియాటిస్ట్ వద్దకు ఎలాంటి సంకోచం, ఆర్థిక వ్యయం లేకుండా సంప్రదించగలిగే స్థాయికి తీసుకురావాలి. మార్కులతో విద్యార్థుల ప్రతిభను లెక్కగట్టే విధానాన్ని రద్దు చేయాలి. గైనకాలజీ, కార్డియాలజీవంటి విభాగాల్లో విద్యను అభ్యసించేందుకు వైద్య విద్యార్థులు ఏ విధంగా ఆసక్తి చూపుతారో అదే విధమైన అవకాశాలను సైకాలజీ విద్యన భ్యసించేందుకు వీలుగా ప్రభుత్వం కొన్ని ప్రోత్సహకాలను అమలు చేయాలి. దీనివల్ల జీవనవిధానంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొలేక ఆత్మహత్యల పట్ల మొగ్గు చూపే వారికి న్యాయం చేసే అవకాశం కలుగుతుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# మరుగుతున్న ఈశాన్యం

కవర్ స్టోరీ

**అన్నవరపు బ్రహ్మయ్య**

**స్వార్థ రాజకీయాలు, అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు రూపం మణిపూర్ జాతుల సమస్య కారణంగా రావణ కాష్టంలా అయిదు దశాబ్దాలుగా మండుతూనే వుంది.**



ఇందుకు తిలా పాపం తలా పిడికెడు అన్నట్టుగా నేడు మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక రాజకీయ నాయకులు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

పోలీసుల కథనం ప్రకారం మే 3 మార్చ్ సందర్భంగా చురాచంద్‌పూర్ జిల్లాలోని టోర్‌బంగ్ ప్రాంతంలో సాయుధ గుంపు మెయితీ కమ్యూనిటీకి చెందిన వ్యక్తులపై దాడి చేసింది. ఇది లోయ జిల్లాల్లో ప్రతీకార దాడులకు దారి తీసింది. మూడు గంటలకు పైగా కొనసాగిన హింసలో టోర్బంగ్‌లోని అనేక దుకాణాలు, ఇళ్లు ధ్వంసమయ్యాయి, దగ్ధమయ్యాయి. గత కొన్ని రోజులుగా జరుగుతున్న మారణకాండలో దాదాపు 50 మంది ప్రజలు మరణించినట్లు, వందల మంది గాయపడినట్లు, వేలాది మంది నిరాశ్రయులైనట్లు వార్తలు వస్తున్నాయి. కుకీ, మెయితీ కమ్యూనిటీలకు చెందిన 10,000 మందికి పైగా ప్రజలు, ఇతరులు తమ తమ ప్రాంతాలను వదిలి ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. హింసాత్మక ప్రాంతాల నుంచి దాదాపు 15,000 మందిని రక్షించి వారికి ఆశ్రయం కల్పించినట్లు రక్షణ వర్గాలు తెలిపాయి. వాహనాలతో సహా భవనాలు, ఇళ్లు, ఇతర ఆస్తులు ధ్వంసమయ్యాయి. మృతుల సంఖ్యపై ఇంకా అధికారిక ధృవీకరణ జరగలేదు.

మణిపూర్‌లో జరుగుతున్న ఘటనల గురించి సింపుల్‌గా చెప్పాలంటే మణిపూర్ మైదానం నిండా మైతేయి ప్రజలు, చుట్టూ ఉన్న కొండ ప్రాంతం నిండా కుకీ, నాగా గిరిజన జాతుల ప్రజలు జంధ్యం వేసుకుని, నొసటి నుండి ముక్కు మీదికి ఇస్కాన్ నామాలు ధరించి తాము కృష్ణుడి బంధువులమని చెప్పుకుంటారు. గిరిజన జాతుల ప్రజలందరూ షెడ్యూల్ ట్రైబ్స్(ఎస్‌టి) కాగా, మైతేయిలుగా పిలిచే మైతేయి బ్రాహ్మణ, మైతేయి సనామాహి, మైతేయి రాజకుమార్ కులాలు బీసీలుగా ఉన్నారు. మైతేయిలలో 10 శాతం ముస్లిములు కూడా ఉన్నారు. వాళ్లు కూడా బీసీలే. ఇంతవరకు బాగానే ఉంది. తెలుగు రాష్ట్రాలలోని గిరిజన ప్రాంతాలలో గిరిజనేతరులు ఆస్తులు కొనుగోలు చేయకుండా అమలులో వున్న 1/70 చట్టం మాదిరిగానే గిరిజనులు నివసించే కొండ ప్రాంతాలలో స్థలాలు కొనే హక్కు ఎస్టీలకే ఉంది. అయితే మైతేయి ప్రజలు తమను కూడా ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నారు. వాళ్లను ఎస్టీ తరగతిలో చేర్చే విషయాన్ని పరిశీలించమని మణిపూర్ హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఉత్తర్వులకు తోడు షెడ్యూల్డ్ తెగల జాబితాలో మెయితీ కమ్యూనిటీని చేర్చడానికి వీలుగా సిఫారసు పంపాలని మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం కోరింది. ఈ నేపథ్యంలోనే హింసాత్మక ఘటనలు చోటు చేసుకొంటున్నాయి.

ఇటీవల మణిపూర్ హైకోర్టు ఆదేశాలను వ్యతిరేకిస్తూ ఆల్ ట్రైబల్ స్టూడెంట్స్ యూనియన్ మణిపూర్(ఎటిఎస్‌యుఎం) నిరసన ర్యాలీకి పిలుపునిచ్చింది. ఈ పిలుపు మేరకు అన్ని జిల్లాల్లో మే 3న సంఘీభావ యాత్రను నిర్వహిస్తున్న సందర్భంగా హింస మొదలైంది. మే 4న హింస తీవ్రరూపం దాల్చడంతో, అత్యవసర నిబంధనలలో భాగమైన రాజ్యాంగంలోని ఆర్టికల్ 355ను కేంద్రం అమలులోకి తెచ్చింది. ఈ ఆర్టికల్ బాహ్య దురాక్రమణ లేదా అంతర్గత అవాంతరాల నుండి రాష్ట్రాలను రక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఇది కేంద్రానికి అధికారం లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం పరిస్థితులను చక్కదిద్దడంలో భాగంగా గత కొన్ని రోజులుగా, ఆర్మీ, అస్సాం, రైఫిల్స్, ర్యాపిడ్ యాక్షన్

ఫోర్స్, స్థానిక పోలీసు సిబ్బందికి చెందిన ట్రక్కుల కాన్వాయ్‌లు రాష్ట్రంలోని ప్రభావిత ప్రాంతాల్లోకి పంపించాయి.

ఉగ్రవాద చర్యలకు లేదా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వివిధ దేశాలకు చెందిన ప్రభుత్వాలు ఆయా దేశాలలో చదువుకొనే విద్యార్థులను లేదా అక్కడ పనిచేసే ఉద్యోగులను యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక విమానాల ద్వారా తమ తమ దేశాలకు తరలించడం అందరికీ తెలిసిన విషయమే. కానీ సొంత దేశంలో చదువుకొనే విద్యార్థులను కూడా ప్రత్యేక విమానాల ద్వారా తరలించాల్సి రావడం పాలకుల అసమర్థతకు నిదర్శనమని చెప్పక తప్పదు. దేశంలోని మణిపూర్ రాష్ట్రంలోని కేంద్రీయ విద్యా సంస్థలలో చదివే వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులను యుద్ధ ప్రాతిపదికన ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ రాష్ట్రాలకు తరలించాయి.



## కొనసాగుతున్న ఉద్రిక్తతలు

సైన్యం ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తూ పరిస్థితిని నియంత్రించడానికి అధికారులు కష్టపడుతున్నారు. మొబైల్ డేటా, బ్రాడ్ బ్యాండ్ సదుపాయాలను నిలిపివేశారు. ప్రస్తుతం హింస, గందరగోళం సద్దుమణిగినట్టు కనిపిస్తున్నప్పటికీ ఏ క్షణం ఏం ముంచుకు వస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు.

ప్రస్తుతానికి, దాదాపు 10,000 మందిని చురాచంద్‌పూర్‌లోని సురక్షిత గృహాలు లేదా షెల్టర్‌లకు, ఇంఫాల్ లోయలో మరో 2,000 మందిని, టెంగ్‌నౌపాల్ జిల్లాలోని సరిహద్దు పట్టణమైన మోరేలో 2,000 మందిని తరలించారు.

ప్రశాంతత కోసం ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ చేసిన విజ్ఞప్తి ఫలించలేదు. అపార్థం వల్లే ఈ హింస జరిగిందని సూచిస్తూ, అదనపు పారామిలటరీ బలగాలను రప్పించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని సింగ్ చెప్పారు. హింసకు పాల్పడుతున్న వ్యక్తులు, సమూహాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర బలగాలను ఆదేశించారు.

మెయితీ ప్రజల ప్రాబల్యం ఉన్న ఇంఫాల్ వెస్ట్, కక్చింగ్, తౌబాల్, జిరిబామ్, బిష్ణుపూర్ జిల్లాలతో పాటు కుకీ ఆధిపత్యం ఉన్న కాంగ్‌పోక్పి, తెంగ్నౌపాల్ జిల్లాల్లో నిరవధిక కర్ఫ్యూ విధించారు. ఇంఫాల్‌లోని లాంఫెల్‌పట్ లోని సిఆర్‌పిఎఫ్ శిబిరంలో కుకీ కమ్యూనిటీకి చెందిన దాదాపు 500 మంది ప్రజలు ఆశ్రయం పొందారని తాజా నివేదికలు తెలిపాయి. కాంగ్‌పోక్పి జిల్లాలోని మోట్‌బంగ్ ప్రాంతంలో, కుకీ ప్రజలు గణనీయమైన సంఖ్యలో



ఉన్నారు. ఇక్కడ 20 ఇళ్లకు నిప్పు పెట్టారు. దాంతో కుకీ ఆధిపత్యం ఉన్న చురచంద్‌పూర్ జిల్లా నుండి మెయితీ కమ్యూనిటీకి చెందిన వెయ్యి మందికి పైగా ప్రజలు పారిపోవాల్సి వచ్చింది. టెంగ్నౌపాల్ జిల్లాలోని సరిహద్దు పట్టణం మోరే నుండి కూడా హింసాత్మక సంఘటనలు నమోదయ్యాయి. ఇక్కడ అనేక మెయితీల గృహాలకు నిప్పు పెట్టారు. రాజధాని ఇంఫాల్‌లో కూడా అనేక ప్రాంతాలలో హింసాత్మక సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి.

మణిపూర్ జనాభాలో 53 శాతం ఉన్న ప్రధానంగా మణిపూర్ లోయలో నివసించే మెయిటీ కమ్యూనిటీని ఎస్‌టి జాబితాలో చేర్చాలనే డిమాండ్ కారణంగా జాతుల మధ్య ఘర్షణలు తలెత్తాయనే వార్తలు వస్తున్నాయి. కానీ ఇది బయటకు కనిపించే కారణం మాత్రమే. చాలా కాలంగా కుకీలలో అంతర్లీనంగా ఉన్న కోపం, అసహనం వంటి ఇతర కారణాలు కూడా వున్నాయి. రాష్ట్రంలోని కొండ ప్రాంతాలలో రిజర్వ్ చేయబడిన రక్షిత అడవులపై ప్రభుత్వం నిర్బంధాలు పెట్టడం ద్వారా కుకీలను హింసకు గురి చేస్తున్నారనే భావన కూడా కారణంగా చెప్పవచ్చు. అంతేకాకుండా మయన్మార్‌లోని సరిహద్దుకు ఆవల ఉన్న ఇదే జాతికి చెందిన అనేక మంది చిన్‌లు, అక్కడి హింస భరించలేక పారిపోయి భారత దేశంలోకి ప్రవేశించారు. అక్రమ వలస దారులు అని పేరుతో వారి పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న కఠినమైన వైఖరి కూడా కుకీలకు కోపం తెప్పించింది.

మణిపూర్‌లోని కొండల్లోని రిజర్వ్‌డ్, రక్షిత అటవీ ప్రాంతాలను గిరిజన సంఘాలు ఆక్రమించాయి. ఆ భూములను గసగసాల సాగుకు ఉపయోగిస్తున్నాయి. కొండల్లోని అనేక ఎకరాల భూములు మాదకద్రవ్యాలకు సంబంధించిన వాటిని సేద్యం చేయడం వ్యతిరేకిస్తూ బిజెపి ముఖ్యమంత్రి కఠినమైన వైఖరి అవలంబించడం వల్ల కూడా కుకీలలో వ్యతిరేకత వచ్చింది.

మాదక ద్రవ్యాల ఉత్పత్తి నేపథ్యంలో కుకీ ప్రజలందరినీ "డ్రగ్ లార్డ్స్" అని ప్రచారం చేయడం వల్ల కూడా కుకీలు తప్పు పడుతున్నారు.

మణిపూర్‌లో జనాభా పెరుగుదల కారణంగా భూమి కొరత వుంది.

పూర్వం జనాభా పెరిగినట్లయితే గిరిజన సమూహాలు అటవీలోనే వేరొక ప్రాంతంలో గుడిసెలు వేసుకొనేవారు. ఆ అటవీలో విస్తరించడం గిరిజనులు తమ హక్కుగా భావిస్తారు.

అదేవిధంగా ప్రస్తుతం కూడా కుకీలు అటవీ ప్రాంతంలో చొచ్చుకు వస్తున్నారు. ప్రస్తుతం అనధికారికంగా అటవీ ప్రాంతంలో చొచ్చుకు రావడాన్ని ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది.

ఇదేసమయంలో లోయలలో నివసించే మెయితీలు, కొండ ప్రాంతాలలో స్థిరపడటానికి లేదా భూమిని కొనుగోలు చేయడానికి సిద్ధపడుతున్నారు. అయితే తెలుగురాష్ట్రాలలో గిరిజన ప్రాంతాలలో ఇతరులు ఆస్తులు కొనుగోలు చేయకుండా 1/70 చట్టం వున్నట్టుగానే మణిపూర్‌లో కూడా గిరిజనులు నివసించే ప్రాంతాలలో ఇతరులు ఆస్తులు కొనుగోలు అవకాశం లేదు. ఆ కారణంగా మెయితీలు ప్రభుత్వంపైన, కుకీలపైన అసంతృప్తితో ఉన్నారు. అయితే గిరిజన ప్రజలు గిరిజనేతర ప్రాంతాలలో భూములు/ ఆస్తులు కొనుగోలు చేస్తున్నప్పుడు తాము గిరిజన ప్రాంతాలలో ఆస్తులు ఎందుకు కొనకూడదని ప్రశ్నిస్తున్నారు. ఈ అంశాల నేపథ్యంలో కుకీలు, మెయితీల మధ్య విభేధాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది మార్చి 10న, చురచంద్‌పూర్, ఉఖ్రుల్, కాంగ్‌పోక్పి, తెంగ్నౌపాల్, జిరిబామ్, తమెంగ్‌లాంగ్‌లతో సహా కొండ జిల్లాల్లో భారీగా ర్యాలీలు జరిగాయి. కుకీ తెగకు చెందిన వేలాదిమంది కుకీలను సెలెక్టివ్ టార్గెట్ అని నినాదాలు చేశారు. అదేవిధంగా ర్యాలీలో కె.సాంగ్‌జాంగ్ గ్రామం నుండి నివాసితులను ఖాళీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ వారు నినాదాలు చేశారు.



ఇండిజినస్ ట్రైబల్ లీడర్స్ ఫోరమ్ ఇటీవల ఏర్పడిన గిరిజన సమూహాల సమ్మేళనం ఆందోళ నకు పిలుపునిచ్చింది.

ర్యాలీల సమయంలో నిరసనలో పాల్గొన్న కుకీ రెచ్చగొట్టారు. కుకీలు నిర్వహించిన ర్యాలీల పట్ల ప్రభుత్వం అనుసరించిన వైఖరికి నిరసనగా మార్చి 11న, రాష్ట్ర ప్రభుత్వం కొనసాగుతున్న త్రైపాక్షిక చర్చల నుండి వైదొలగడం ద్వారా ప్రతీకారం తీర్చుకుంది. ఇది రెండు సాయుధ రాజకీయ గ్రూపులు, కుకీ నేషనల్ ఆర్మీ, జోమీ రివల్యూషనరీ ఆర్మీలతో సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్ (ఎస్ఓఎస్) ఒప్పందాన్ని ఉపసంహరించు కుంది. ఎస్ఓఎస్ ఒప్పందం అనేది 2008లో యునైటెడ్ పీపుల్స్ ఫ్రంట్, కుకీ నేషనల్ ఆర్గనైజేషన్ అనే కొండల్లో వుండే గిరిజన సాయుధ సంస్థలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చల అనంతరం చేసుకొన్న కాల్పుల విరమణ ఒప్పందం. కుకీ నేషనల్ ఆర్మీ, జోమీ రెవట్యూషనరీ ఆర్మీ రెండూ వున్నాయి. కుకీ నేషనల్ ఆర్గనైజేషన్‌లో భాగంగా పనిచేసే సాయుధ సంస్థలు ఇవి. షెడ్యూల్డ్ హిల్ ప్రాంతాల ప్రభుత్వం, మణిపూర్‌కు వర్తించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370,371సి 'తీవ్రమైన నిర్లక్ష్యం'పై ప్రజల అసంతృప్తి ఫలితంగా ఈ ర్యాలీలు జరిగినట్లు వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ర్యాలీలో పాల్గొన్న వారిని 'ఆక్రమణదారులు, గసగసాల సాగుదారులు, మాదకద్రవ్యాల స్మగ్లర్లు, అక్రమ వలసదారులు' అని ముఖ్యమంత్రి పేర్కొన్నందుకు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.




## ప్రభుత్వ వైఫల్యం

ఇక్కడ ప్రభుత్వం వైఫల్యం కూడా వుంది. గిరిజన జనాభా పెరుగుతున్న స్థితిలో కొత్త గ్రామాలను ఎలా గుర్తించాలనే దానిపై ప్రభుత్వానికి అసలు విధానం లేదు. అలాగే అటవీ సంరక్షణకు సంబంధించిన పారదర్శకమైన విధానం కూడా లేదు. దీంతో సొంత పార్టీలోనే దుమారం రేగింది. ఏప్రిల్ 12 నాటి లేఖలో అటవీ శాఖ నిర్వహించిన సర్వే ప్రజలను తీవ్ర అన్యాయం చేస్తోందని వ్యాఖ్యానించారు. ప్రతిపాదిత రక్షిత అటవీ ప్రాంతాల నుంచి కొన్ని గ్రామాలను మినహాయిస్తూ గతంలోని అసిస్టెంట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ (ఏఎస్ఓ) ఉత్తరులు జారీ చేశారు. అయితే ఆ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడం సరికాదని హాకిప్ ఇటీవల అసెంబ్లీలో వ్యాఖ్యానించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ లేనప్పుడు భూమిపై ముందుగా ఉన్న హక్కులకు సంబంధించిన ఏవైనా క్లెయిమ్‌లను సెటిల్ చేయడానికి 1927 నాటి ఇండియన్ ఫారెస్ట్ యాక్ట్ ప్రకారం చట్టబద్ధమైన అథారిటీగా వున్న ఏఎస్ఓ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం ఎలా రద్దు చేయగలదని ప్రశ్నిస్తున్నారు.

వివాదాలను పరిష్కారం చేయడంలో జాప్యానికి సంబంధిత అధికారుల తప్పిదమే తప్ప భూ యజమానులది కాదు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద సర్వే రికార్డులు లేకుంటే, చురచంద్‌పూర్-ఖౌపుమ్ అటవీ ప్రాంతాన్ని రక్షిత ప్రాంతంగా ప్రకటించిన గెజిట్ లోపభూయిష్టంగా ఉందని, అందువల్ల సర్వే చెల్లుబాటు కాదని, ఈ అంశంపై స్పష్టత వచ్చేవరకు తదుపరి సర్వేలను నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఏప్రిల్ 11, 2023న లాంగోల్ రిజర్వ్ ఫారెస్ట్ లోపల 26 ఇళ్లలో కనీసం కొన్నింటిని కూల్చివేశారు. ఫిబ్రవరి 21,

## చారిత్రక వాస్తవాలు

మణిపూర్‌లో జాతుల సమస్యల తరహాలోనే ఈశాన్య రాష్ట్రాల మధ్య సరిహద్దు సమస్యలు కూడా దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. ఈ రాష్ట్రాలలో సరిహద్దు నదులు, ప్రవాహాలు, రాళ్ల వంటి సహజ సంపదతో కూడిన భూమి వుంది. ఇదే సమయంలో సరిహద్దు తగిన విధంగా నిర్ణయించకపోతే గ్రామాల్లో ఎటువంటి హక్కులు లేకుండా, ద్వితీయశ్రేణి పౌరుల మాదిరిగా జీవించాల్సి వస్తుందని గిరిజనేతర ప్రజలలో భయం ఉంది. ఈ భయాన్ని తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుంది. ప్రజలలో భయం తొలగి భరోసా ఏర్పడినప్పుడే పరిస్థితులు అదుపులో వుంటాయి. ఈశాన్య రాష్ట్రాలకు అస్సాం మాతృరాష్ట్రమని చెప్పవచ్చు. అస్సాం నుంచే ఇతర ఈశాన్య రాష్ట్రాలు ఏర్పాటయ్యాయి. ఈకారణంగానే అస్సాం కు మేఘాలయతోనే కాకుండా అరుణాచల్‌ప్రదేశ్, మిజోరాం, నాగాలాండ్‌లతో కూడా సరిహద్దు వివాదాలు ఉన్నాయి. 2019లో జరిగిన ఎన్ఎల్ఎఫ్‌టి, 2020లో జరిగిన బ్రూ-రియాంగ్ ఒప్పందం, 2020 జరిగిన బోడో ఒప్పందం, 2021లో జరిగిన కర్బీ-అంగ్లాంగ్ ఒప్పందాల ద్వారా ఈశాన్య ప్రాంతంలో శాంతిని నెలకొల్పడానికి అనేక చర్యలు తీసుకొన్నారు. నేటి అస్సాం-మేఘాలయ సరిహద్దు ఒప్పందం.



2023న చురచంద్‌పూర్‌లోని కె.సాంగ్‌జాంగ్ గ్రామ నివాసితులు 2020లో గూగుల్ మ్యాప్‌లో చూసినప్పుడు ఆ ప్రాంతంలో ఎటువంటి నివాసాలు లేనట్టుగా చూపింది. కానీ కుకీల ప్రకారం 38 గ్రామాలలో దాదాపు 50-60 సంవత్సరాలు ప్రతిగ్రామంలో కనీసం వెయ్యిమంది ప్రజలు నివసిస్తున్నారు. చురచంద్‌పూర్‌లోని 38 గ్రామాల గుర్తింపును రద్దు చేస్తూ అటవీశాఖ నవంబర్ 2022లో నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాతనే ఈ తొలగింపు జరిగింది. నోనీ జిల్లాలు, అవి చురచంద్ పూర్‌ఖౌపుమ్ రక్షిత అటవీ పరిధిలోకి వస్తాయని పేర్కొంది. అర్హత లేని ఒక అధికారి గ్రామాలకు సెటిల్‌మెంట్‌కు అనుమతి ఇచ్చారని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అనుమతి ఇచ్చిన అధికారికి అర్హత వుందో లేదో ప్రజలకు తెలియదు..ప్రజలు మాత్రం అటవీ అధికారులకు తెలియచేసిన తర్వాతనే ఈ గ్రామాలలో ఇళ్లు ఏర్పాటు చేసుకొన్నారు. కానీ ఇప్పుడు అనధికారికంగా ఇళ్లు నిర్మించారని ఎలా ప్రకటిస్తారని, దీనికంతటికి ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని ఈ గ్రామస్తుల ఆరోపణలు. ఇటీవల మణిపూర్ పర్యటనలో కేంద్ర పర్యావరణ, అటవీ-వాతావరణ మార్పుల మంత్రి భూపేందర్ యాదవ్, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1927 అటవీ చట్టం రాష్ట్ర పరిధిలోకి వచ్చిందని, అయితే 1976 సవరణ తర్వాత, అటవీ భూమి రెండు రాష్ట్రాల అధికార పరిధిలోకి వచ్చిందని నొక్కి చెప్పారు. కేంద్ర ప్రభుత్వాలు, రాష్ట్ర ప్రభుత్వం అటవీ యాజమాన్యాన్ని నిలుపుకుంటుంది. రిజర్వ్ చేసిన, రక్షిత అటవీ భూమిని రక్షించే బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని అన్నారు.

### ముగింపు

నిజానికి ఎటువంటి సమస్యనైనా సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవచ్చు. కాని కొన్ని రాజకీయ శక్తులకు సమస్య పరిష్కారం కావడం వల్ల కలిగే ప్రయోజనాల కంటే సమస్య కొనసాగడం వల్ల కలిగే ప్రయోజనం ఎక్కువగా వుంటున్నాయి. ఆయాశక్తుల వెనుక వున్న రాజకీయ శక్తులను నివారించడం అవసరం. తమ రాజకీయ అవసరాల కోసమే జాతుల అంశాలను, విభజన అంశాలను, సరిహద్దు అంశాలను ముందుకు తీసుకు రావడం అలవాటుగా మారింది. అందు వల్లనే ఎన్ని చట్టాలు చేసినా,



కమిషన్లు వేసినా ప్రయోజనం వుండటం లేదు. సమస్య పరిష్కారానికి కమిషన్ల చేసే సిఫార్సులు రికార్డులకే పరిమితం అవుతున్నాయి. ఈ కారణంగా జాతుల హక్కులు, సరిహద్దు వివాదాలు, విభజన అంశాలు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. దశాబ్దాల నాటి వివాదాల పరిష్కారం కోసం ప్రజాభిప్రాయాన్ని సేకరించడం అవసరం. ఇదేసమయంలో ఈ వివాదాలకు రాజకీయ పరిష్కారం చేసుకోవడానికి నాయకులు ముందుకు రావాలి. ❒



## ఆసక్తిగా మెయితీల ఆచారాలు

మణిపూర్ ప్రాంతంలో మెయితీ ప్రజల ఆచార వ్యవహారాలు ఆసక్తిగా వుంటాయి. మెయితీ రెస్టారెంట్లు ప్రత్యేకంగా వుండటమే కాకుండా అక్కడ పనిచేసే మెయితీలు చొక్కా విప్పి జంధ్యం చేయిస్తూ సర్వ్ చేస్తుంటారు. వీరు మాంసం తింటారు, కానీ మాంసం వండుకోవాలంటే ఇంటి బయటే వంట పొయ్యి రాజేసుకుంటారు. మాంసం పాత్రలు కూడా ఇంట్లో నిషిద్ధం. అయితే చేపలైతే ఇంట్లోకి అనుమతి వుంది. వ్యవసాయయోగ్యమైన మైదానం మొత్తం మైతేయి ప్రజల చేతిలోనే ఉంది. శాసనసభలో డెబ్బై నుండి ఎనభైశాతం ఎప్పుడూ వీళ్లే ఉంటారు. 17శాతం బీసీ రిజర్వేషన్ పొందుతున్నారు. 10శాతం ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కూడా ఉంది. ఎస్టీలకు 31శాతం రిజర్వేషన్ ఉంది. ఎస్సీ జనాభా అంతగా కనిపించదు. అందుకే వారికి 2శాతం రిజర్వేషన్ అమల్లో వుంది.

# పసందైన వంటలు

## స్వీట్ పొటాటో పూరీ



**కావలసిన పదార్థాలు:** చిలగడ దుంపలు-3 (కుకర్‌లో మెత్తగా ఉడికించుకోవాలి)
గోధుమపిండి-2కప్పులు
గోరువెచ్చని నీళ్లు- కొద్దిగా (పూరీపిండి కలిపేందుకు)
మైదాపిండి- 2 టేబుల్ స్పూన్లు,
ఉప్పు- తగినంత
నూనె-సరిపడా

**తయారీవిధానం**

ముందుగా ఒక బౌల్ తీసుకుని, అందులో చిలగడ దుంపల ముద్ద, గోధుమపిండి, మైదాపిండి, ఉప్పు, అరటీస్పూన్ నూనె వేసుకుని, కొద్దిగా గోరువెచ్చని నీళ్లు పోసుకుంటూ మెత్తగా ముద్దగా కలుపుకోవాలి. 20 నిమిషాలు పక్కన పెట్టుకుని, నూనె అప్లై చేసుకుంటూ చిన్న చిన్న పూరీల్లా ఒత్తుకోవాలి. తర్వాత కడాయిలో నూనె కాచి ఈ పూరీలను వేయించుకోవాలి.

## రస్క్ ఖీర్

**కావలసిన పదార్థాలు**

రస్క్ పౌడర్ - కప్పు
చిక్కటి పాలు- ఒకటిన్నర కప్పులు
మొక్కజొన్న పిండి- 2 టేబుల్ స్పూన్లు
పంచదార - టీస్పూన్
జీడిపప్పు ముక్కలు, పిస్తా ముక్కలు-గార్నిష్‌కి (మీ అభిరుచిని బట్టి)

**తయారు చేసేవిధానం**

ముందుగా నెయ్యి వేడి చేసి జీడిపప్పు ముక్కలు, పిస్తా ముక్కలు దోరగా వేయించి, తీసి పక్కన పెట్టుకోవాలి. తర్వాత అదే నేతిలో రస్క్ పౌడర్, మొక్కజొన్న పిండి వేసుకుని వేయించుకోవాలి. అందులో కొద్దికొద్దిగా పాలు పోసుకుంటూ, ఉండలు కట్టకుండా గరిటెతో బాగా కలుపుతుండాలి. ఆ మిశ్రమం కాస్త చిక్కబడిన తర్వాత పంచదార వేసి బాగా కలపాలి. అనంతరం ఏలకుల పొడి వేసి మరో 2 నిమిషాల పాటు ఉడికించుకోవాలి. చివరగా నేతిలో వేయించి పక్కన పెట్టుకున్న డ్రైఫ్రూట్స్ ముక్కలతో గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకోవాలి. ❒



## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com







# తక్కువ ధరకే పుస్తకాలు

చదువుకోవాలనే ఆశ ఉండి చదువుకోలేని వారు ఎంతోమంది మనచుట్టూ ఉన్నారు. కనీసం ఐదొందలు పెట్టి పుస్తకాలు కొనలేని నిరుపేదలూ ఉన్నారు. ఇలాంటివారికి తక్కువ ధరకే పుస్తకాలు అందిస్తున్న వెబ్‌సైట్లు ఉన్నాయని మీకు తెలుసా? అంతేకాదు ఎప్పటి నుంచో చదవాలనుకున్న ఓ మంచి నవల చాలా తక్కువ ధరకే దొరికితే! ఓ పది చిట్టి పుస్తకాలన్నింటినీ కలిపి రెండుమూడు వందల రూపాయలకే కొనగలిగితే, మెడికల్ పుస్తకాలూ ఉచితంగానే లభిస్తే..ఇలా మన అవసరాన్ని బట్టి ఒక్కొక్కరికి ఒక్కోలా ఉపయోగపడేలా అందుబాటులో ఉన్నాయి. కొన్ని సెకండ్ హ్యాండ్ పుస్తకాల వెబ్‌సైట్లు ఉన్నాయి. పుస్తకాలను అమ్మేవాళ్లకీ కొనేవాళ్లకీ మధ్య వారధిలా పనిచేసే వీటిల్లో మనకు నచ్చినవి చాలా తక్కువ ధరకే కొనుక్కోవడమే కాదు, అమ్ముకోవచ్చు కూడా. పైగా కొన్ని సంస్థలు ఉచితంగానే అందిస్తున్నాయి. బుక్‌ఫ్లో, యూజ్డ్ బుక్స్ ఫ్యాక్టరీ, బుక్‌షెల్ఫ్, బుక్‌చోర్, 99 బుక్స్‌కార్ట్, కితాబే..లాంటి వెబ్‌సైట్లలో చిన్నారుల బడి పుస్తకాల దగ్గర్నుంచి రకరకాల పోటీపరీక్షల పుస్తకాలూ, ఇంజినీరింగ్, మెడికల్ పాఠ్యపుస్తకాల వరకూ ఎన్నెన్నో ఉంటాయి. అంతేకాదు..బుజ్జాయిల కామిక్ బుక్స్‌తోపాటూ పెద్దవాళ్ల కథలూ, నవలలూ, వ్యక్తిత్వవికాస పుస్తకాలూ, మహనీయుల చరిత్రలూ వివిధ భాషల్లో చాలానే అందుబాటులో ఉంటాయి. వీటిల్లో ఏదైనా పుస్తకం తక్కువ ధరకే కొనుక్కోవచ్చు. కావాలంటే పుస్తకం అమ్మేవ్యక్తితో బేరసారాలూ ఆడి మరింత రేటు తగ్గించుకోవచ్చు. ఒకవేళ అలాంటి పుస్తకాలే ఇంట్లో మనకు అవసరం లేకుండా ఉన్నాయంటే వాటి వివరాలు అప్‌లోడ్ చేసి అమ్మేయొచ్చు. అయితే ఏది చేయాలన్నా ముందుగా ఆ వెబ్‌సైట్లో రిజిస్టర్ అవ్వాలి. అమ్మాలనుకున్న పుస్తకం పూర్తి వివరాల్నీ ఇవ్వాలి. తక్కువ ధరకే ఇస్తున్నాం కదా అనీ ఏదో ఒకటి పెట్టలేం. అది ఖచ్చితంగా చదవడానికి వీలుగా ఉండాల్సిందే. అకడమిక్, పోటీపరీక్షల పుస్తకాల్లాంటివి వాటి పబ్లికేషన్‌కు సంబంధించిన సమాచారమూ అందించాలి. అలా పుస్తకంతో పాటు మన వివరాలన్నీ ఇస్తే..కొనేవాళ్లు నేరుగా మనల్ని సంప్రదిస్తారన్నమాట. ఇవికాకుండా, సెకండ్‌హ్యాండ్ పుస్తకాల్ని ఉచితంగా ఇస్తోంది మైపుస్తక్.కామ్. దీంట్లోనూ అన్నిరకాల పుస్తక కేటగిరీలుంటాయి. దేశంలో వివిధ ప్రాంతాల దాతల నుంచి విరాళంగా పొందిన పుస్తకాలే అవన్నీ కూడా. దీంట్లో మనకు అవసరమైన పుస్తకాన్ని ఉచితంగానే పొందొచ్చు. కానీ అది మన దగ్గరకు చేరడానికి అయ్యే తపాలా ఖర్చులు మాత్రం మనమే చెల్లించాల్సి ఉంటుంది. ఇంకా బుక్‌బోర్‌లాంటివి కొందరు దాతల నుంచి పుస్తకాల్ని తీసుకొని వాటిని నామమాత్రపు ధరలకు అందిస్తున్నాయి. పుస్తకోష్ వెబ్‌సైట్ ద్వారా అమ్మడమూ, కొనడంతోపాటూ పుస్తకాల్ని అద్దెకీ తీసుకోవచ్చు. దీంట్లో ఆడియో, వీడియో పుస్తకాలూ, రకరకాల ఉచిత కోర్సులూ అందుబాటులో ఉన్నాయి. బుక్స్‌బై కిలో వెబ్‌సైట్లో పుస్తకాల్ని ఎంచక్కా కిలోల చొప్పున కొనొచ్చు. ఇక పరీక్షలు అయిపోయాయి..ఈ తరగతి పుస్తకాలు అక్కర్లేదు అని మన దగ్గర ఏవైనా ఉపయోగ పడని పుస్తకాలు ఉంటే తూకానికి అమ్మేయకుండా ఈ వెబ్‌సైట్ల ద్వారా వేరే వాళ్లకు ఇచ్చేయండి. మీరూ ఆ సౌకర్యాన్ని ఉపయోగించుకోండి. ❑



# హైటెక్ అభివృద్ధి




పరిమళాన్ని పసిగట్టలేని తుమ్మెదలు
పువ్వుల మకరందాన్ని గ్రోలలేకపోతున్నాయి
ఎందుకో మరి!
ఝుం ఝుం నాదాలతో పరిభ్రమించే భ్రమరాలు
చుంబించడం లేదని పుప్పొడి రేణువులకు
కంటి మీద కునుకు లేదు ఎందుకో మరి!
వెదజల్లే ఊపిరాడని క్రిమిసంహారక రసాయనాలు కాబోలు!
పరిశ్రమల వ్యర్థాలతో వాడి పారేసిన ప్లాస్టిక్‌తో
నదీనదాలకు కుష్టివ్యాధి సోకింది.
పక్షవాతం వచ్చింది...
ఇంకా బతుకెందుకని పడుతూ లేస్తూ
వంకరలు తిరుగుతూ సముద్రంలో
దుమికి
ఆత్మహత్య చేసుకొంటున్నాయి.
బోర్లు ఒళ్లంతా చీల్చుతుంటే
అడవులను
ఎడారులుగా చేసి సారాన్ని అరటిపండు తొక్కలా
తీస్తుంటె నేలమ్మ వెంటిలేటర్ ఎక్కి మరణం అంచున
క్షణలను లెక్కపెడుతుంది. పులి జింకను వేటాడినట్లు
పంచభూతాలను కాలుష్య చదలు వెంటాడి
సజీవంగా కొరుక్కుతింటుంది.
గతులు తప్పిన ఋతువులు మనుషులను
శవాలుగా చేసి శ్మశానానికి చావుడప్పుళ్లతో
తీసుకొని పోతున్నాయి
హైటెక్ అభివృద్ధి నిశ్చేష్టురాలై ప్రత్యక్ష సాక్షిగా చూస్తుంది.

**- పూసాల సత్యనారాయణ**

---

## నేను

**నేను..**
పట్టపగలు వెన్నెల స్నానం చేస్తాను
రాత్రివేళ..
నులివెచ్చని కిరణాల స్పర్శతో
పులకరిస్తాను
ఆరోగ్యం కోసం అహర్నిశలూ
అమృత బిందువుల దివ్యత్వాన్ని
గుటకలేస్తాను
శిశిరంలో వసంతాన్ని ఒడిలో
నింపుకుంటాను
ఎడారుల్లో సైతం చినుకుల సంగీతం
వింటాను
రెక్కలు మొలిచి విశ్వమంతటా
ఎగురుతాను
సర్వాంతర్యామినై సర్వం దర్శిస్తాను
నాకు తెలియకుండానే ఆవేశంతో
అగ్నినవుతాను
గిలగిలలాడిపోతూ కన్నీటి
ప్రవాహాన్నవుతాను
ఉన్నట్లుండి నవ్వుల
ఉద్యానవనాన్నవుతాను
నేను..
మంచి పుస్తకాన్ని ఆస్వాదిస్తున్న
మనస్సు ని!


**- డి.కె.చదువులబాబు**

---

## మట్టిచేతులు

తను తిన్నా తినకున్నా
ఆరుగాలం శ్రమించే అతను
అన్నం పెట్టేందుకు నిత్యం
ఆరాట పడుతుంటాడు!
దుక్కి దున్ని, విత్తు నాటి
నారు పోసి, నీరు పెట్టి
కలుపు తీసి
కోతకొచ్చిన పంటపొలాన్ని
కంటికి రెప్పలా కాపాడే
రైతన్న ప్రజల పాలిట
కల్పతరువై కడుపు
నింపుతుంటాడు.
చేసిన అప్పు తీర్చలేక
చతికిలపడిన రైతన్న
అకాల వర్షాలకు
తట్టుకోలేక
నడి వీధిలో నిలబడి
విలపిస్తున్నాడు.
దళారుల చేతుల్లో దగా
పడిన
అతను కోలుకోలేని
దెబ్బతిని
వేయి కళ్లతో ఆపన్న
హస్తంకోసం
ఎదురు చూస్తున్నాడు.
అన్నం పెట్టే రైతే
దేశానికి
రాజైతే అన్నపూర్ణకు ఇకపై
కొదువే లేదు!
ఆకలి తీర్చే ఆ మట్టిచేతులే
లేకపోతే ఇకపై దేశమంతా
క్షామంతో నిండిపోయి
ఆకలి మంటలతో
రగిలిపోతుంది.

**- ఎస్.జవేరియా**



# పుస్తక సమీక్ష

## రేపటి పౌరులు, సమస్యల అవగాహన



నేటి బాలలే రేపటిపౌరులు. సమాజనిర్మాతలు. బాలలుగా ఉన్నప్పుడే వారిని తీర్చిదిద్దితే దేశం బాగుపడుతుంది. సమాజం సౌభాగ్యవంతమవుతుంది. ఒకప్పుడు పిల్లల పెంపకం అంతగా కష్టం కాకపోయేది. వాళ్లు తమ బాల్యావస్థదశలో తోటిపిల్లలతో కలిసిమెలిసి తిరుగుతూ, వారితో ఆడుకుంటూ ఎన్నో విషయాలపై అవగాహన పెంచుకుంటూ, తల్లిదండ్రుల ఆవశ్యకత, తిండిబట్ట, చదువుకే పరిమితం అయ్యేది. కాలంమారిందిప్పుడు. కుటుంబాలన్నీ వ్యష్టికుటుంబాలయ్యాయి. ఇదేకాకుండా, తల్లిదండ్రులు ఇరువురూ పని చేస్తే కాని గడవని రోజులు వచ్చాయి. వీటన్నింటివల్ల పిల్లలపై ప్రత్యేకమైన శ్రద్ధ, వారి నడవడికపై ఓ కన్నేసి ఉంచాలి. తప్పుదారి పడుతోన్నట్లనిపించితే, వారిని సక్రమమైన మార్గంలోకి మళ్లించాల్సి ఉంది. దీనికి తగినట్లు పిల్లల ఆలోచనాధోరణులను ప్రభావితం చేసే ఇంటర్నెట్‌లు, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు వచ్చాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని డా॥ఆశ్లేష ఈదల 'బాల్యశోభ'ను రూపొందించారు. 51 అధ్యాయాలున్న ఈ సంపుటిలో అశ్లేష పేరేంటింగ్ అంటే ఏమిటి? పిల్లల్లో చెడుఅలవాట్లను ఎలా గుర్తించాలి? ఆడపిల్లలయితే గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లు అంటే ఏమిటి? చిన్నపిల్లలకు వచ్చే ఆరోగ్యసమస్యలు, మొబైల్ వ్యసనం నుండి తప్పించటం ఎలా? లాంటి ఎన్నో తల్లిదండ్రులకు ఆవశ్యకరమైన విషయాలను వివరిస్తున్నారు.

**(బాల్యశోభ, రచన: డా॥అశ్లేష ఈదల, వెల: రూ499, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్)**

**- కూర చిదంబరం**

## ఊహాలతో అలరారుతున్న కవిత్వం



'ఏదో చేస్తున్న భావన/ ఏదీ చెయ్యలేనివేదన/ అర్థంకాని తపన/ సాగే ఈ కవితా ప్రవాహానికి/ గమనం ఏదో/ గమ్యం ఎక్కడో/ తీరం ఏదో!!' అంటూ కొన్ని ఊసులు, మరికొన్ని ఊహలు కలగలిపి 75 కవితల ఊయలల్లి 'భవసాక్ష్యం' కవితా సంపుటిని మన ముందుంచారు. ప్రకృతి ప్రేమికురాలైన ఈ కవయిత్రికి మేఘాలన్నా, వర్షపు తళుకులన్నా, నీటి ప్రవాహపు ఒంపులన్నా చాలా యిష్టం. చాలా కవితల్లో ఆ అలలపై విహరిస్తూ మనల్ని పలకరిస్తారు. రైతన్నలకు నష్టాన్ని ఒనగూర్చే అకాలవర్షాల పట్ల అసహనం వెలిబుచ్చుతారు. కరోనా బీభత్సం వలసకూలీలకు మిగిల్చిన విషాదం పట్ల కవయిత్రి ఆవేదన చదివితీరాల్సిందే. 'ట్రంకుపెట్టె'లో భద్రపరిచిన ఊహాలకందని ఊసులెన్నో వినిపించ డమేగాదు.."లచ్చిమీ..నా చెలీ!' అంటూ విరహాన్ని పూరించిన ప్రేమగీతంతో అలరిస్తారు. 'కిక్కు' కోసం సంసారాన్ని నాశనం చేసుకునే మందుబాబులను మందలిస్తు అత్యంత సహజంగా కవితను వినిపిస్తారు. 'చూసారా! విన్నారా!/ ధరలో ధరలచిత్రం/ శ్రమ ఒకడిది..శాసనం ఒకడిది' అంటూ బహిరంగంగా జరుగు తున్న శ్రమదోపిడీని దృశ్యమానం చేస్తారు మోహన వల్లి. బాల్యం అంటే అందరికీ యిష్టమే. అందునా అమ్మమ్మ ఊరంటే మరీను. మోహనవల్లికిది తొలి ప్రయత్నమైనా పదబంధాలు, భావచిత్రాల తో కవితాప్రియుల్ని ఆకట్టుకునే నైపుణ్యం కనబరిచారనే చెప్పవచ్చు. **(భవసాక్ష్యం, రచన: మోహనవల్లి, వెల: రూ 125, ప్రతులకు: న్యూవిద్యార్థి బుక్‌లింక్స్, 9-322, నెహ్రూబజార్, మదనపల్లి)**

**- రమణ వెలమకన్ని**

## 'అద్దేపల్లి ఫేస్‌బుక్ చమక్కులు'

కవి, ముఖపుస్తక మిత్రులకు ఈ కవితాసంపుటి అంకితం చేసారు. డా॥బీరం సుందరరావు, నందిరాజు విజయ్‌కుమార్‌లు చక్కటి ముందుమాటలు రాసారు. 'అద్దేపల్లి' అనగానే ప్రముఖకవి సాహితీవిమర్శకులు రామమోహన్‌రావు గుర్తుకొస్తారు. చాలా కవితలు మినికవితారూపంలో చమక్కుమనిపిస్తాయి ఈ చమక్కులు. మచ్చుకు కొన్నింటిని చూద్దాం.



స్మార్టుఫోనొచ్చాక సులువైంది/ పాలకుల పని/ జనమే చూసేసుకుంటున్నారు/ అరచేతిలో వైకుంఠాన్ని! (పేజీ.48). మనుషుల మధ్య మానవసంబంధాలు దూరం చేస్తున్న సెల్‌ఫోన్ల వాడకంపై కవి వేసిన చమక్కు ఆలోచింపజేస్తుంది. నేటి రాజకీయనేతలపై ఓ కవితలో కవి ఇలా అంటారు వ్యంగ్యంగా! (పేజీ.51). 'నలుగురిలోకొస్తే/ నీతివాక్యాలు వల్లిస్తాం/ ఎవరూ చూడక పోతే/ ఎంతకైనా తెగిస్తాం' అనడం వాస్తవమే. 'ఫేస్బుక్కులో పోస్టంటే/ ప్లేసు నింపటం కాదు/ అక్షరాలకు జీవంపోసి/ అంతరిక్షంలోకి పంపటం! (పే.34) అంటారు కవి. సిజేరియన్లకు సుముహూర్తాలు/ హత్యలకు పెట్టుడు ముహూర్తాలు/ మనిషి చేతుల్లోకి/ చావుపుట్టుకలు! (పే.41) అంటారు ఓ తాత్త్వికతతో కవి. అలాగే పార్టీమారే నేతలపై చక్కటి చమక్కులు రాసారు కవి. 'పూటకో జెండా/ నేతలకు మేతే ఎజెండా/ డ్రస్సు మార్చినంత ఈజీగా/ కేరాఫ్ అడ్రస్సులు' (పే.29) అంటారు.

**(ఫేస్‌బుక్ చమక్కులు, రచన: అద్దేపల్లి భరత్‌కుమార్, వెల: రూ60, ప్రతులకు: ఇ.నం.101, లక్ష్మీహోమ్స్, శ్రీసాయికృష్ణాకాలనీ, రోడ్ నం.2, ప్రగతినగర్, హైదరాబాద్)**

**- తంగిరాల చక్రవర్తి**

## మన ఘంటసాల

'బాపు' ముఖచిత్రంతో, ఘంటసాల శతజయంతి సందర్భంగా, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, డా.పి.ఎస్. గోపాలకృష్ణ, డా॥ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం సమర్పణగా ప్రచురింప చేసారు. 1974 ఫిబ్రవరి 11న ఘంటసాల స్వర్గస్థులై ఇంచుమించు రెండుదశాబ్దాల తరువాత హైదరాబాద్‌లో విగ్రహావి



ష్కరణ, మరొక దశాబ్దం తరువాత శతజయంతి సందర్భంగా ఈ గ్రంథం పునర్ముద్రణ పొందింది. ఈ గ్రంథంలో ఘంటసాలగ్రామం, జీవిత విశేషాలు, వెండిపండుగ, విదేశీయాత్ర అనుభవాలు, శ్రద్ధాంజలి అనంతరం, గాయకుడు, సంగీత దర్శకుడు, మనిషి-మనీషి, సమ్మానధనుడు, ఎన్నటికీ సజీవులే అధ్యాయాలలో ఘంటసాల ప్రతిభావిశేషాలు వివరించారు. అనుబంధాలుగా, స్వీయరచనలు, మీ ఘంటసాల కథ, జీవితంలో నేనెదుర్కొన్న పోరాటం, గురువుగారు, గీతాలు, సహజ యశో పద్మశ్రీ విభూషితులు, సంగీత దర్శకత్వం వహించిన చిత్రాలు, మరపురానివీ మరువలేనివీ చోటు చేసుకొన్నాయి. ఛాయాచిత్రమాలి కతో అమరగాయకుల్ని అద్భుతంగా కళ్లకు కట్టించారు. వేగేశ్న-వంశీ ఆశ్రమంలోని సద్గురు ఘంటసాల ఆలయం, తెలుగు ప్రజకు, సంగీత, సినీకళాకారులకు ఘంటసాల పట్ల వున్న ఆరాధనాదైవ స్వరూప మహనీయత స్పష్టం చేస్తోంది.

**(మన ఘంటసాల, రచన: డా.పి.ఎస్.గోపాలకృష్ణ, సమర్పణ డా॥ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం, వెల: రూ500, ప్రతులకు: అన్వీక్షికి ప్రచురణలు, నవోదయ బుక్‌హౌస్)**

**- యర్రమిల్లి**





# అశ్లీల చెర నుంచి భద్రత


**లైంగిక** వేధింపులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతుంటాయి. ప్రభుత్వాలు ఎన్నిచర్యలు తీసుకుంటున్నా ఇంటర్నెట్‌లో తరచితరచి పోర్న్ వెబ్‌సైట్లు తెరిచి చూస్తుంటారు చాలామంది. 18ఏండ్లలోపు పిల్లలకు ఇలాంటి దృశ్యాలను చిత్రాలను చూపించడాన్ని చైల్డ్ పోర్నోగ్రఫీగా పిలుస్తారు. చాలాదేశాల్లో చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ మెటీరియల్ (సీఏఎస్ఎమ్)ను తీవ్రనేరంగా పరిగణిస్తారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వాళ్లపై క్రిమినల్ కేసులు పెట్టి చట్టపరంగా కఠినమైన శిక్షలు అమలు చేస్తారు. ఎన్ని చట్టాలు చేసినా ఈ దుశ్చర్యలు ఆగడం లేదు. పైశాచిక ఆనందం కోసం, ఆర్థిక ప్రయోజనం ఆశించి పిల్లలను వేధింపులకు గురిచేసే వారు కొందరైతే, అవకాశావాదులు మరోరకం. ఇలాంటివారు తేనెపూసిన కత్తుల్లా వ్యవహరిస్తారు. పైకి దురుద్దేశం లేనట్టుగా ప్రవర్తించినా పరిస్థితులను ఆసరాగా చేసుకొని తమ వికృత రూపం ప్రదర్శిస్తుంటారు. ఎలాంటి వారైనా లైంగిక వేధింపులు తలపోసే కీచకులకు కీలెరిగి వాత పెట్టడమే సరైన పరిష్కారం. బాల్యంలో లైంగిక వేధింపులకు గురైన వారు కొంతకాలానికి శారీరకంగా తేరుకున్నా, మానసికంగా దీర్ఘకాలం ఆవేదనకు గురవుతూనే ఉంటారు. వాళ్ల తప్పులేనప్పటికీ నిరంతరం ఆత్మనూన్యతకు లోనవుతుంటారు. జీవితాన్ని సాధారణంగా కొనసాగించలేక తమలో తాము సతమతమవుతారు. ఇంకొందరు పోస్ట్‌ట్రోమాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (తీవ్రమానసిక ఒత్తిడి) బారినపడతారు. ఈ ఒత్తిడి నుంచి బయటపడేందుకు కొందరు వ్యసనాలకు బానిసగా మారతారు.

## అండగా ప్రభుత్వం

లైంగిక వేధింపుల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించడానికి చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ మెటీరియల్ (సీఏఎస్ఎమ్)ఉంది. ఆడపిల్లలకు అండగా నిలబడటానికి ప్రభుత్వం 2012 నుంచి పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్) చట్టం అమలు చేస్తున్నది.




2021లో భారత ప్రభుత్వం డిజిటల్ మీడియా విలువలకు సంబంధించి పలు మార్గదర్శకాలు జారీ చేసింది. సామాజిక మాధ్యమాలతోపాటు ఇతర మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌లలో సీఏఎస్ఎమ్ కంటెంట్‌ను గుర్తించడంతో పాటు దానిని తొలగించేలా గైడ్‌లైన్స్ రూపొందించింది. ప్రభుత్వంతోపాటు పలు ఎన్జీవోలు సైతం సీఏఎస్ఎమ్‌కు వ్యతిరేకంగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాయి. ప్రజల్లో, చిన్నారుల్లో అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.



## అడ్డుకునే మార్గాలు

ఆడపిల్లల బాల్యాన్ని చిదిమేస్తున్న సీఏఎస్ఎమ్ ఆకృత్యాలకు అడ్డుకట్ట వేయడానికి జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రత్యేక కార్యాచరణ అమలు పరుస్తున్నది. మహిళా శిశు అభివృద్ధి శాఖ వివిధ ఏజెన్సీల సాయంతో ఇలాంటి దుశ్చర్యలను నిరోధిస్తున్నది. బాధితులకు అండగా ఉంటున్నది. సీఏఎస్ఎమ్, లైంగిక వేధింపులపై అవగాహన కల్పించేలా సదస్సులు నిర్వహిస్తున్నది.ఎన్జీవోలు సైతం ఈ యజ్ఞంలో భాగమవుతున్నాయి. పిల్లలకు ఏది ఎలాంటి స్పర్శో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పాలి. ఎవరైనా బెదిరిస్తే కుంగిపోకుండా ఇంట్లోవారికి విషయం చెప్పి, వారికి నమ్మకం కలిగించాలి. కుటుంబ మర్యాద దెబ్బతింటుందని అపోహపడి బెదిరిపోకుండా వెంటనే ఫిర్యాదు చేయాలి. ❍




ఒకప్పుడు గగన ప్రయాణికులకు విమానయాన సంస్థలే ఫలహారాలు ఇచ్చేవి. పోటీ పెరిగిపోయి..టికెట్ల ధరలు పడిపోయాక

# విమానంలో భోజనం రెడీ

ఇంకేముంది, వింతైన వంటకాలు సిద్ధం



ఆ బాధ్యత నుంచి మెల్లగా తప్పుకొన్నాయి. మంచినీళ్ల మాత్రం అందిస్తున్నాయి. ఫ్లైట్‌లో ఏం తినాలన్నా కొనాల్సిందే. అంత డబ్బు పెట్టినా..రుచీపచీ ఉండదు. తప్పదు కాబట్టి పొట్ట నింపుకోవాల్సిందే. మేఘాలలో తేలిపోతూ మనసుకు నచ్చిన రుచుల్ని ఆస్వాదించే అదృష్టమే ఉండేది కాదు. కస్టమర్ దేవుడికి నైవేద్యం విషయంలో లోటు చేస్తే తమ ఉనికికే ప్రమాదమని విమానయాన సంస్థలు గుర్తించాయి. దీంతో మెనూ మార్చేస్తున్నాయి. కొత్త రుచులు జోడిస్తున్నాయి. అవసరమైతే ఫుడ్ స్టార్టప్స్‌తో ప్రత్యేక ఒప్పందాలు చేసుకుంటున్నాయి. మీల్ ఆఫ్ ద మూమెంట్, యూఫుడ్ ల్యాబ్స్, ఆర్గానిక్ రూట్స్, ది టేస్టీ కంపెనీ, త్రిగుణి ఈజీ ఈట్స్ వంటి కంపెనీలు విమానాల్లో విందుల బాధ్యత తీసుకుంటున్నాయి. ఇంకేముంది, ఆవురావురుమంటూ ఆమ్లేట్ తినొచ్చు, బిర్యానీ ఆరగించవచ్చు. ఉప్మా తింటూ ప్రయాణాన్ని ఎంజాయ్ చేయెుచ్చు.

**కొత్త ఆదాయ మార్గం**

పెరుగుతున్న ఇంధన ధరలు, సిబ్బంది జీతభత్యాలు, ఇలా రకరకాల కారణాలతో విమానయాన సంస్థ మనుగడ దినదినగండంగానే ఉన్నది. ఈ పరిస్థితుల్లో ఫ్లయిట్లను ఓ మోస్తరు రెసాటరెంట్లుగా మార్చేస్తే ఎలా ఉంటుంది? అనే ఆలోచన వచ్చింది. రుచికరంగా అనిపిస్తే కస్టమర్లు ఎంత డబ్బు పెట్టుడానికైనా వెనుకాడరు. అయిపోతున్నాయి. అదే సమయంలో జనంలో ఆరోగ్యస్పృహ పెరిగిపోయింది. దీంతో ఆర్గానిక్ మంత్రాన్ని అందుకుంటున్నారు. మిల్లెట్ రుచులు అందించే ప్రయత్నం కూడా జరుగుతున్నది. త్వరలోనే విమాన టికెట్ కటే భోజనాల ఖర్చులే ఎక్కువ అవుతాయేమో!

### త్రిగుణి ఈజీ ఈట్స్

ఉప్మా, పులిహోర, బిసిబేళాబాత్, వెజిటబుల్ ఫ్రైడ్‌రైస్ వంటి హోమ్లీ మసాలా ఉడ్ ఇండిగో వంటి సంస్థలకు అందిస్తున్నది. ఇండిగోతో టైఅప్ తర్వాత మార్కెట్ పెరిగింది. కొత్త ఆఫర్ల వస్తున్నాయి.

### ది టేస్ట్ కంపెనీ

ఈ సంస్థ ప్రతినిధులు మొదటి హైదరాబాద్ విమానయాన సంస్థ అయిన ట్రూజెట్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఆ తర్వాత ఎయిర్ ఇండియా, ఎయిర్ ఏషియా, ఆకాశ, ఇండిగో కంపెనీలకు రెడీ-టు-ఈట్ ఆహార పదార్థాలు అందిస్తున్నారు. రొయ్యల బిర్యానీ, కోడికూర, తెల్లన్నం, పప్పన్నం, దాల్‌మఖానీ, ఓట్‌మీల్ ఇతర రెగ్యులర్ బ్రేక్‌ఫాస్ట్ రుచులు సరఫరా చేస్తున్నారు.



### యూ ఫుడ్‌ల్యాబ్స్

ఈ సంస్థ ప్రత్యేకించి లగ్జరీ ప్రైవేట్ జెట్స్‌లో ప్రయాణించే వారికి ఆహారం అందిస్తున్నది. ఆర్డర్లు కూడా ప్రైవేట్ జెట్స్ నుంచే ఎక్కువగా వస్తాయి. పాస్తా, క్యారెట్ హల్వా వగైరా రుచులు భారీ పరిమాణంలో సరఫరా చేస్తున్నారు.

### ఆర్గానిక్ రూట్స్

పురుకు తగ్గట్టే పక్కా సేంద్రియ ఆహార పదార్థాలు సరఫరా చేస్తున్నారు. రెడీ టు ఈట్ మిల్లెట్ ఐటమ్స్‌ను స్పైస్‌జెట్ లాంటి ఎయిర్‌లైన్స్‌కు అందిస్తున్నారు. చిరుధాన్యాల చిరుతిళ్లు, ఫలహారాలు వీళ్ల స్పెషల్.

### మీల్ ఆఫ్ ద మూమెంట్

భోజన తయారీ సంస్థలు ఇండిగో, ఆకాశ, ఎయిరిండియా, స్పైస్‌జెడ్, ఎయిర్ ఏషియాతో టైఆప్ అవుతున్నాయి. ప్రయాణీకుల డిమాండ్ మేరకు వెరైటీ ఫుడ్ సప్లై చేస్తున్నాయి. ప్రస్తుతం ఒక్కో ఎయిర్ లైన్‌కూ 30వేల నుంచి 2 లక్షల మీల్‌బౌల్స్ పంపుతున్నారు. ప్లెయిన్ ఉప్మా, సోహా, నెయ్యి ఉప్మా, పాస్తా, బిర్యానీ, ఫ్రైడ్‌రైస్ వగైరా సర్వ్ చేస్తున్నారు.





కథ

# అతి అనర్థదాయకం

'నాయనా అరవింద్! ఆ సెల్‌ఫోన్ పక్కన పెట్టి కాసేపు చదువుకో!" అని వంటింట్లో ఉన్న తల్లి లలిత బిగ్గరగా అరచింది. ఆ అరుపులను ఆరేళ్ల అరవింద్ పట్టించుకోలేదు. సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుతూ లీనమైపోయాడు. ప్రతీరోజు ఇదే తంతు. అరవింద్ పాఠశాల నుండి ఇంటికి రాగానే సెల్‌ఫోన్ తీసుకుని వీడియో గేమ్స్ ఆడేవాడు. సెల్‌ఫోన్ ఎక్కువగా వాడితే కంటికి ప్రమాదమని తల్లిదండ్రులు ఎంత మందలించినా లెక్కచేసేవాడు కాదు.

పాఠశాలలో శారీరకంగా దృఢంగా తయారయ్యే అనేక క్రీడలు ఆడిస్తారు. అటువంటి ఆటలలో అరవింద్ పాల్గొనేవాడు కాదు. చెట్టు కింద కూర్చొని విశ్రాంతి తీసుకునేవాడు.

ఇలా కొన్ని నెలలు గడిచాయి. ఒకరోజు అర్ధరాత్రి ఇంట్లో పెద్ద చప్పుడు అయ్యింది. ఆ శబ్దానికి లలిత ఉలిక్కిపడి నిద్రలేచి చూసింది. అరవింద్ కిందపడి ఉన్నాడు. తలకుగాయమై దుస్తులన్నీ నెత్తురుతో నిండి పోయాయి. తల్లిదండ్రులు వెంటనే అరవింద్‌ను ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు. డాక్టర్ అన్ని పరీక్షలు చేశారు.

'మీ అబ్బాయి ఎక్కువగా సెల్‌ఫోన్‌ను చూస్తూ గడపడం వల్ల కంటిచూపు మందగించింది' అని వైద్యుడు చెప్పారు.

అప్పుడు విషయం లలితకు అర్థమైంది. ఇంట్లో ఉన్న సమయమంతా సెల్‌ఫోన్ చూస్తూ వీడియోగేమ్స్ ఆడటం వల్ల అరవింద్ కంటి చూపులో తేడావచ్చినట్లు డాక్టర్ ద్వారా తెలుసుకున్నారు. మంచినీళ్ల కోసం నిద్రలేచినా కళ్లు కనిపించక కిందపడి గాయాలపాలైనట్లు అరవింద్ చెప్పాడు.

'మీ అబ్బాయి అరవింద్ కంటిచూపు మందగించడం అనేది ప్రస్తుతం ప్రథమ దశలోనే ఉంది. రోజూ ఇదే విధంగా స్మార్ట్‌ఫోన్లో వీడియోగేమ్స్ ఆడటం వల్ల మనుముందు పూర్తిగా కంటిచూపు పోతుంది. అంతే కాదు ఎక్కువ సమయం స్మార్ట్‌ఫోన్ చూడటం వల్ల మెదడుకు సంబంధించిన వ్యాధులు కూడా వస్తాయి. కాబట్టి ఇప్పటికైనా స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉండి, ఆహార నియమాలు పాటిస్తూ, సక్రమంగా మందులు వాడితే కంటిచూపు మెరుగౌతుంది' అని డాక్టర్ సూచించారు.

'మా అబ్బాయి మా మాట వినడు డాక్టర్‌గారు! ఏంచేయాలో పాలుపోవడం లేదు' అని అరవింద్ తల్లి లలిత వాపోయింది. 'మీరు కొద్దిసేపు బయటకు వెళ్లండి. మీ బాబుతో నేను మాట్లాడతాను' అని చెప్పారు డాక్టర్. లలిత డాక్టర్‌గారి గది నుండి బయటకు వెళ్లిపోయింది. డాక్టర్ మాట్లాడుతూ అరవింద్‌ను ఆవరణలో ఉన్నఉద్యానవనంలోకి తీసుకుని వెళ్లారు. 'అరవింద్! ఇప్పుడు మనం ఒక ఆట ఆడదాం! నీ కళ్లకు గంతలు కడతాను. నువ్వు ఈ ఉద్యానవనం అంతా నడుస్తూ తిరగాలి' అని చెప్పి అరవింద్ కళ్లకు గంతలు కట్టారు డాక్టర్. అరవింద్ ఉద్యానవనం అంతా నడవడం ప్రారంభించాడు. అర్థగంట తరువాత కళ్లకు కట్టిన గంతలు విప్పారు. 'ఇప్పుడు చెప్పు అరవింద్! కళ్లకు గంతలు కట్టుకుంటే బాగుందా? తీసేస్తే బాగుందా?' అని డాక్టర్ ప్రశ్నించారు.

'కళ్ళకు గంతలు లేకపోతేనే బాగుంది డాక్టర్. కళ్లకు గంతలు కట్టుకుంటే నరకంలో ఉన్నట్లుంది' అన్నాడు అరవింద్. 'నరకంలో శాశ్వతంగా ఉండాలనుకుంటే ప్రతిరోజూ స్మార్ట్‌ఫోన్‌లో వీడియోగేమ్స్ ఆడుకో. కంటిచూపుతో నీ జీవితాన్ని స్వర్గతుల్యం చేసుకోవాలంటే సమయం సందర్భం లేకుండా స్మార్ట్‌ఫోన్‌ను చూస్తూ కాలం గడపకు. ఈ జీవితం చాలా విలువైనది. వాటిని మనకు ఉపయోగపడేంత మేరకే వాడాలి. దాన్ని అతిగా వాడితే అనర్థాలు తప్పవు. ఏ విషయంలోనైనా అతి అనర్థదాయకం. అనారోగ్య సమస్యలు ఉత్పన్నమై జీవచ్ఛావాలవలే మన బ్రతుకులు మారేలా వాటిని ఉపయోగించకూడదు. పుట్టినందుకు జీవితాన్ని సార్థకం చేసుకోవాలి. తెలిసి తెలిసి చేజేతులారా మన జీవితాన్ని మనమే నాశనం చేసుకుంటే ఎలా?' అని హితవు పలికారు డాక్టర్.

ఆరోజు నుండి అరవింద్ స్మార్ట్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ ప్రతిరోజూ శారీరకంగా మేలు చేసే క్రీడలను ఆడుతూ ఉల్లాసంగా విద్యాభ్యాసం చేసి ఉన్నత శిఖరాలకు చేరుకుని తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు తెచ్చాడు.

**- షేక్ అబ్దుల్‌హకీం జాని,** తెనాలి







# పిల్లల పాలపిట్ట

వార్త ఆదివారం

## బాలగేయం

### కోయిల



కూసిందమ్మా కూసింది
కమ్మగ కోయిల కూసింది
కొమ్మల దాగి కూసింది
వీనుల విందు చేసింది
మావి చిగురు మేసింది
మైమరచీ పాడింది
పొద్దుపొద్దునే లేచింది
ముద్దుముద్దుగా కూసింది
జగతినే మేలుకొల్పింది
ప్రగతికి హారతి పట్టింది
ప్రభాత గీతి పాడింది
విశ్వశాంతినే కోరింది.

**- గుండాల నరేంద్రబాబు,** తిరుపతి



## హాలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- సి.ప్రదీక్ష,** నెల్లూరు

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వజ్రాలు చీకట్లో మెరుస్తాయి, కారణం ఏమిటి?

**జవాబు: ప్రదీక్ష!** అన్ని వజ్రాలు చీకట్లో మెరవవు. కొన్నింటికి వున్న ప్రత్యేక లక్షణాల వలన అవి చీకట్లోనూ కాంతినిస్తాయి. సహజ కాంతిలోని అతినీలలోహిత కిరణాలను శోషించుకునే వజ్రాలు కొన్ని మాత్రం చీకట్లో మెరుస్తుంటాయి. ఈ లక్షణాన్ని శాస్త్ర పరిభాషలో 'ఫ్లోరోసెన్స్' అంటారు. వెలుగునిచ్చే ఈ కాంతి చాలావరకు నీలంగా ఉంటుంది. మరికొన్ని వజ్రాలు అతి నీలలోహిత కిరణాలు లేకున్నా ప్రకాశిస్తుంటాయి. ఈ లక్షణాన్ని 'ఫాస్పరోసెన్స్' అంటారు. మామూలుగా వజ్రం మెరుపు కొన్ని వందల సంవత్సరాల వరకు ఒకే విధంగా ఉంటుంది. సహజ రీతుల్లో ప్రకృతి పరంగా లభించే వజ్రాలు అతికఠినంగా, దృఢంగా ఉంటాయి. మన దేశంలో లభించిన 'కోహినూర్' వజ్రం ప్రపంచ ప్రసిద్ధి పొందింది.

**- ఎస్.దండపాణి,** గుమ్మడిపూడి

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. పింగాణీ అంటే ఏమిటి? దీనిని ఎలా తయారు చేస్తారు?

**జవాబు: దండపాణి!** పింగాణీ అనేది ఒక విధమైన మట్టితో తయారయ్యేది. దీనిని 'వైట్ క్లే' అనీ, చైనా క్లే అనీ, కయోలిన్ అనీ పిలుస్తారు. మనకు తెలిసిన బంకమట్టి నల్లగా ఉన్నట్లు, ఈ చైనామట్టి తెల్లగా ఉంటుంది. మనం కుండలను ఎలాగయితే బంకమట్టిని కుమ్మరిచక్రంపైకి చేర్చి, ఆ తర్వాత పచ్చిగా ఉన్న ఆకారాలను దొంతరలుగా పేర్చి, కాల్చి తయారు చేస్తామో ఈ పింగాణి పాత్రలనూ అదే విధంగా తయారు చేస్తారు. చైనా భాషలో కయో-లింగ్ అంటే ఎత్తయిన పర్వతం అని అర్థం. ఈ పదాల నుంచే 'కయోలిన్' అనే పదం ఏర్పడింది. మన దేశంలోనూ ఈ లోహఖనిజం రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో దొరుకుతుంది.







# మార్కెట్లో కొత్తగా..

## హెచ్‌పి కొత్త పెవిలియన్ నోట్‌బుక్స్

యువతరం అవసరాలను దృష్టిలో పెట్టుకొని హెచ్‌పీ ఇటీవల మనదేశంలో కొత్త పెవిలియన్ ప్లస్ నోట్‌బుక్స్‌ను ప్రవేశపెట్టింది. 13వ జెన్ ఇంటెల్‌కోర్ ప్రాసెసర్, తేలికైన డిజైన్, గోప్యత కోసం మ్యానువల్ కెమెరా షటర్ డోర్‌తో కూడిన వీటిని ఉరుకుల పరుగుల జీవనశైలి, వైవిధ్య కంప్యూటింగ్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దింది. ఇంట్లో, బయట ఎక్కడైనా పని చేయటానికి వీలుగా మరింత వినోదాన్ని ఆస్వాదించేలా మల్టీటచ్ సామర్థ్యాలను జోడించింది. కంటికి హాని కలిగించని ఓఎల్ఈడీ తెర దీని ప్రత్యేకత. 400 ఎన్‌ఐటీల ప్రకాశంతో దృశ్యాలను స్పష్టంగా చూపిస్తుంది. టెంపోరల్ నాయిస్ రిడక్షన్‌తో కూడిన హెచ్‌పీ రిజల్యూషన్ హెచ్‌పీ ట్రూ విజన్ 5 ఎంపీ కెమెరా, ఏఐ వాయిస్ రిడక్షన్ ఫీచర్లతో అలరిస్తోంది. ఒకేసారి ఎక్కువ పనులు చేసుకోవటానికి వీలుగా పలు యూఎస్‌బీ పోర్టులతో పాటు యూఎస్‌బీసి పవర్ అడాప్టరు సపోర్టు, హెచ్‌డీఎంఐ, హెచ్‌ఫోన్ జాక్ వంటివీ ఉన్నాయి. దీనిబరువు 1.39 కిలోలు. పెవిలియన్ ప్లస్ 14తో వేగం, డిజైన్, సెక్యూరిటీ ఫీచర్లతో మెరుగు పర్చిన హెచ్‌పీ 14, హెచ్‌పీ 15 సిరియస్ ల్యాప్‌టాప్‌లనూ హెచ్‌పీ పరిచయం చేసింది.

## ఎస్ఎంఎస్ మోసాలకు ట్రూకాలర్ కళ్లెం

ఇటీవల ఎస్ఎంఎస్ మోసాలు పెరిగిపోయాయి. కరెంటు బిల్లు చెల్లింపు, బ్యాంకు సేవలు, ఉద్యోగ ఆహ్వానాలు, కేవైసీకి సంబంధించినవి. రుణాలు, లాటరీలు, దానధర్మాలు..ఇలా ఏ రూపంలోనైనా నకిలీ మెసేజ్‌లు ఉండొచ్చు. ఇవి నిజమేనని నమ్మి క్లిక్ చేస్తే మొదటికే మోసం వస్తుంది. దీన్ని అరికట్టే ఉద్దేశంతోనే ట్రూకాలర్ తమ వినియోగదారుల కోసం కృత్రిమ మేధ ఆధారిత రక్షణ ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ఇది యూజర్ ఫీడ్‌బ్యాక్‌ను గుర్తిస్తుంది. వినియోగదారుల రిపోర్టులతో పనిలేకుండానే కొత్తరకం మోసాలనూ పసిగడుతుంది. నకిలీ మెసేజ్‌లను గుర్తించలేనివారికి, అవి విశ్వసనీయమైన సంస్థలకు చెందినవేనని పొరపాటున నమ్మేవారికి ఈ ఫీచర్ బాగా ఉపయోగపడనుంది. మనదేశంలో ఆండ్రాయిడ్ ఫోన్లు అన్నింటికీ ఈ ఫీచర్ ఉచితంగా అందుబాటులో ఉంది.

### ఎలా పనిచేస్తుంది?

మోసపూరిత మెసేజ్ అందినప్పుడు ట్రూకాలర్ యాప్ స్పష్టంగా ఎర్ర గుర్తుతో సూచిస్తుంది. ఎలాంటి చర్య తీసుకోవద్దని నోటిఫికేషన్‌తో హెచ్చరిస్తుంది. మనకు మనం దాన్ని తిరస్కరించేంతవరకు నోటిఫికేషన్ తెర మీద అలాగే ఉంటుంది. ఒకవేళ హెచ్చరికను చూడకుండా ఎస్ఎంఎస్‌ను ఓపెన్ చేస్తే ట్రూకాలర్ తనకు తానే లింకులను డిసేబుల్ చేస్తుంది. మెసేజ్‌ను పంపినవారు మంచివారేనని మనం మార్కు చేస్తేనే యాక్సెస్ చేసుకోవటానికి వీలు కల్పిస్తుంది. ఇది మరో రక్షణ ఏర్పాటు.

యాప్ ఎలాంటి మెసేజ్‌లను అప్‌లోడ్ చేయదని ట్రూకాలర్ స్పష్టం చేసింది. మొత్తం ప్రక్రియఅంతా ఫోన్‌కే పరిమితమై ఉంటుంది.


### ఐఫోన్ నీటిలో తడిస్తే?

ఐఫోన్ పొరపాటున నీళ్లలో పడిందా? అయితే వర్చువల్ అసిస్టెంట్ సిరిని ఆదేశించండి. ఇది ఫోన్‌లోంచి నీటిని బయటకు వెళ్లగొట్టటానికి సాయం చేస్తుంది. నిజానికి తాజా ఐఫోన్లు దుమ్ముధూళి, నీటిని తట్టుకుంటాయి. అంతమాత్రాన అసలే నీరు లోపలికి పోదని అనుకోవద్దు. కనెక్షన్ పోర్టులు, స్పీకర్ రంధ్రాల్లోంచి నీరు లోపలికి వెళ్లొచ్చు.



ఇలాంటప్పుడు బియనయంతో, సిలికా ప్యాకెట్లతో తేమను తొలగించటానికి ప్రయత్నిస్తుంటారు. యాపిల్ వర్చువల్ అసిస్టెంట్ సిరి ట్రిక్కు గురించే చాలామందికి తెలియదు. ఐఓఎస్ 12, ఆ తర్వాత ఆపరేటింగ్ సిస్టమ్‌తో కూడిన ఐఫోన్లలో వాటర్ ఎజెక్షన్ సదుపాయముంది. స్పీకర్ నుంచి త్వరగా, తేలికగా నీటిని బయటకు వెళ్లగొట్టేందుకు దీన్ని రూపొందించారు. ఇది ప్రత్యేకమైన ధ్వనిని పుట్టిస్తుంది. దీని ద్వారా పుట్టుకొచ్చే శబ్దతరంగాలు స్పీకర్‌లోంచి నీటిని బయటకు వెళ్లగొడతాయి. స్టీరియో స్పీకర్లు, వాటర్ రెసిస్టెంట్ డిజైన్ గల ఐఫోన్లలో వాటర్ ఎజెక్షన్ ఫీచర్ ఉంటుంది. ఐఫోన్ వెబ్ బ్రౌజర్ నుంచి 'వాటర్ ఎజెక్ట్ షార్ట్‌కట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని షార్ట్‌కట్స్ యాప్‌లో జత చేసుకోవాలి. 'హేసిరి, రన్ వాటర్ ఎజెక్ట్' అని ఆదేశిస్తే యాక్టివేట్ అవుతుంది. షార్ట్‌కట్స్ యాప్‌లో 'బిగిన్ వాటర్ ఎజెక్షన్' మీద తాకటంతోనూ యాక్టివేట్ చేసుకోవచ్చు.

### పాస్‌వర్డ్‌లతో పారాహుషార్




కృత్రిమ మేధతో ఉపయోగాలే కాదు, ప్రమాదాలూ పొంచి ఉండొచ్చు. ఇది తరచూ వాడే పాస్‌వర్డ్‌లలో చాలావాటిని నిమిషంలోనే క్రాక్ చేస్తున్నట్టు తాజా పరిశోధనలో బయటపడింది మరి. హోం సెక్యూరిటీ హీరోస్ వెబ్‌సైట్‌కు చెందిన పరిశోధకులు పాస్‌గాన్ అనే ప్రోగ్రామ్‌తో దీన్ని నిర్వహించారు. పాస్‌గాన్ అనేది కృత్రిమ మేధతో కూడిన పాస్‌వర్డ్ క్రాకర్. దీని ద్వారా సైబర్ పరిశోధకులు కోటిన్నరకు పైగా పాస్‌వర్డ్‌లను పరీక్షించారు. తరచూ వాడే వాటిల్లో ఇది 51శాతం పాస్‌వర్డ్‌లను చిటికెలో కనిపెట్టేసింది. మరికొన్నింటిని గంటలోపు క్రాక్ చేసింది. పుట్టిన తేదీ, ఫోన్ నంబర్ల వంటి ఊహించటానికి తేలికైనవి. కొద్ది అక్షరాలతో కూడిన మామూలు పాస్‌వర్డ్‌లను ఇది త్వరగా ఛేదిస్తుండటం గమనార్హం. అందువల్ల ఏఐ విప్లవ యుగంలో పాస్‌వర్డ్‌ల భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఎట్టి పరిస్థితుల్లోనూ మామూలు, తేలికైన.. ముఖ్యంగా అంకెలు మాత్రమే గల పాస్‌వర్డ్‌లను పెట్టుకోవద్దు. కనీసం 15 క్యారెక్టర్లతో కూడిన పాస్‌వర్డ్‌లను నిర్ణయించుకోవాలి. వీటిల్లో అక్షరాలతో పాటు గుర్తులు, అంకెలూ ఉండాలి. క్యాపిటల్స్, చిన్న అక్షరాలు..రెండింటినీ కలగలిపి ఎంచుకోవాలి. పాస్‌వర్డ్‌ల భద్రత కోసం పాస్‌వర్డ్ మేనేజర్లను వాడుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు. అలాగే ప్రతి మూడు లేదా ఆర్నెల్లకోసారి పాస్‌వర్డ్‌లను మార్చుకుంటూ ఉండాలి. అన్ని ఖాతాలకు ఒకే పాస్‌వర్డ్‌ను పెట్టుకోవద్దు. ఇది చాలా ప్రమాదకరం.

### యాపిల్ వాచ్ మాయ

ఇటీవల స్మార్ట్‌వాచ్‌లకి ఆదరణ పెరుగుతోంది. వీటిల్లో యాపిల్ వాచ్ తీరే వేరు. ఇది ఐఫోన్‌కు మంచి తోడు. నోటిఫికేషన్లు మేనేజ్ చేయటానికి, కాల్స్ చేసుకోవటానికి, ఐఫోన్‌ను తాకకుండానే కొన్ని యాప్స్‌తో పనులు చేసుకోవటానికీ తోడ్పడుతుంది. హెల్త్ అండ్ ఫిట్‌నెస్ యాప్ శరీర సౌష్టవాన్ని మెరుగుపరచుకోవటానికి దోహదం చేస్తుంది. దీన్నుంచి అందే నోటిఫికేషన్లు అన్నింటికన్నా పైన కనిపిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంటాయి. యాక్టివిటీ యాప్, నోటిఫికేషన్ సెంటర్, వాచ్ ఫేసెస్ వంటివే కాదు..ఇంకెన్నో ఫీచర్లు దీని సొంతం. మీరూ యాపిల్ వాచ్ కొన్నారా? ఎక్కడ నుంచి ఆరంభించాలో తెలియటం లేదా? అయితే కొన్ని చిట్కాలు, ఫీచర్ల గురించి తెలుసుకోవాల్సిందే.

### యాప్ లాంచర్‌గా డాక్

యాపిల్ వాచ్‌లో డాక్ గురించి చాలామందికి తెలియదనే చెప్పుకోవచ్చు. సైడ్ బటన్‌ను నొక్కినప్పుడు ఇది కనిపిస్తుంది. అయితే దీని పేరు తికమకకు గురిచేస్తుంది. ఇది ఐఫోన్‌లో యాప్ స్విచర్ మాదిరిగా డిఫాల్ట్‌గా రీసెంట్ యాప్స్‌ను చూపిస్తుంది. అంతేకాదు, దీన్ని యాప్ లాంచర్‌గానూ వాడుకోవచ్చు. ఇందుకోసం వాచ్‌యాప్‌ను ఓపెన్ చేసి డాక్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. రీసెంట్స్ నుంచి ఫేవరట్‌లోకి మార్చుకోవాలి. తరచూ వాడే యాప్స్‌ను ఫేవరట్‌లో యాడ్ చేసుకుంటే చాలు. సైడ్ బటన్‌ను నొక్కగానే డాక్‌లో అవన్నీ జాబితా రూపంలో కనిపిస్తాయి. వీటి మీద ట్యాప్ చేసి యాప్‌ను లాంచ్ చేసుకోవచ్చు.

### సైలెంట్ మోడ్‌ను ప్రయత్నించండి

యాపిల్ వాచ్‌ను ధరిస్తే కలిగే గొప్ప మేలు ఐఫోన్ దగ్గర లేకపోయినా పనులు చేసుకునే వీలుండటం. తరచూ ఎన్నో మెసేజ్‌లు, కాల్స్ వస్తుంటాయి. వీటన్నింటినీ ఐఫోన్‌ను తాకకుండానే చేసుకోవచ్చు. అంటే గంటల కొద్దీ ఐఫోన్‌ను సైలెంట్ మోడ్‌లో పెట్టినా వాచ్‌తోనే చాలావరకు పని కానీచేయొచ్చు. అయితే డిఫాల్ట్‌గా యాపిల్ వాచ్ కూడా ప్రతి నోటిఫికేషన్‌కు శబ్దం చేస్తుంది. ఇదీ కొన్నిసార్లు చికాకు పరచొచ్చు. మరి దీన్నీ సైలెంట్ మోడ్‌లో పెట్టుకుంటే? వాచ్ షేప్‌ను స్వైప్ చేసి కంట్రోల్ సెంటర్‌లోకి వెళ్లాలి. బెల్ గుర్తు మీద ట్యాప్? చేసి సైలెంట్ మోడ్‌ను ఎంచుకోవాలి. దీంతో నోటిఫికేషన్ అందినప్పుడు వాచ్ నెమ్మదిగా మణికట్టు మీద తడుతుంది. వాచ్‌ను తాకితేనే తెర వెలుగుతుంది.

### తెలివిగా నోటిఫికేషన్స్ మేనేజ్



ఎల్లప్పుడూ చేతికి యాపిల్ వాచ్‌ను ధరిస్తే వచ్చే నోటిఫికేషన్లను చూడటానికే సమయం సరిపోతుంది. ఒకవేళ వాచ్ ధరించకపోతే ఏమేం నోటిఫికేషన్లు వచ్చాయో అనే గాబరా మొదలవుతుంది. ఇలాంటి ఇబ్బందిని తప్పించుకోవటానికి ఆయా నోటిఫికేషన్లను డిసేబుల్ చేసుకునే సదుపాయమూ ఉంది. దీన్ని నోటిఫికేషన్ సెంటర్ నుంచి సెట్ చేసుకోవాలి. నోటిఫికేషన్‌ను ఎడమ వైపునకు స్వైప్ చేసి, మెనూ బటన్ మీద ట్యాప్ చేయాలి. తర్వాత 'టర్న్ ఆఫ్ ఆన్ యాపిల్ వాచ్'ను ఎంచుకోవాలి. కావాలంటే 'డెలివర్ క్వైట్లీ' ఆప్షన్‌నూ ఎంచుకోవచ్చు. ఇది సౌండ్స్, వైబ్రేషన్లను డిసేబుల్ చేస్తుంది. ఐఫోన్ ద్వారానూ నోటిఫికేషన్స్ అందకుండా చూసుకోవచ్చు. ఐఫోన్‌లో సెట్టింగ్స్ ద్వారా నోటిఫికేషన్స్‌లోకి వెళ్లి 'మిర్రర్ ఐఫోన్ అలర్ట్స్ ఫ్రం' విభాగంలోకి వెళ్లాలి. ❑

కథ

# అక్షర దక్షిణ

శ్యామ్‌కుమార్ చాగల్

**హైస్కూల్ ఆవరణ పిల్లల అరుపులతో నిండిపోయింది. శాస్త్రి ప్రవేశంతో మొత్తంగా ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. కాస్త ఎత్తులో ఉన్న స్టేజి మీదెక్కి చేతిలో కర్రతో అందరి వంకా గంభీరంగా చూసాడు శాస్త్రి. కొద్దిసేపటికి హెడ్‌మాస్టర్, మరికొందరు ఉపాధ్యాయులు వచ్చి మౌనంగా నిలబడ్డారు.**

ఆఫీస్ రూమ్‌లోకి వెళ్లి కిటికీలో నుండి వీరందరిని చూసిన శాస్త్రి వెంటనే అక్కడున్న మీట నొక్కాడు. దాంతో 'వందేమాతరం' గీతం మొదలైంది. దాని తర్వాత 'జనగణమన' జాతీయ గీతం మొదలైంది. అది పూర్తవగానే విద్యార్థులందరూ ఒకే వరుసలో నడుస్తూ తమ తమ తరగతుల్లోకి వెళ్లిపోయారు.

మొదటి గంట టంగుమంటూ మోగింది. కాసేపట్లో తరగతుల్లోకి ఉపాధ్యాయులు చేరుకున్నారు. బడి ఆవరణ అంతా నిశ్శబ్దం ఆవరించింది.

ఏడవ తరగతి గదిలో సైన్స్ పాఠం జరుగుతూ వుంది. బోర్డు మీద రాస్తూ విషయాన్ని వివరిస్తున్నాడు శాస్త్రి.



విద్యార్థినీ, విద్యార్థులందరూ ఏకాగ్రతతో వింటున్నారు. ఆయన చెప్తున్నది వింటున్న విద్యార్థులందరు డాక్టర్లుగా లేక సైంటిస్ట్ అవ్వాలని అనుకోసాగారు. శాస్త్రి క్లాస్ ఉన్నంతసేపూ విద్యార్థులు మంత్రముగ్ధులై వింటారు. అతనంటే విద్యార్థులందరికీ ఎనలేని గౌరవం. కాస్త భయం కూడా.

"ఏరా సుధాకర్! నాలుగు రోజులు రాలేదేం?" అడిగాడు శాస్త్రి.

"మా అయ్యతో పొలంకోతలకు వెళ్లాను సార్" అన్నాడు సుధాకర్ లాగును పైకి చెక్కుకుంటూ.

"సరే కూర్చో. మీ నాన్నను రేపు వచ్చి నన్ను కలవమను" అని చెప్పి బోర్డు వైపు తిరిగి పాఠం చెప్పసాగాడు.

స్కూల్ ఆఖరి గంట కొట్టారు. విద్యార్థులందరూ బిల బిలమంటూ ఇండ్లకు వెళుతూ వున్నారు. స్కూటర్ ఆపి ఇంట్లోకి వెళ్లి గుమ్మం వద్ద కాళ్లు కడుక్కుని లోనికి అడుగు పెట్టాడు శాస్త్రి.

కొద్దిసేపటికి పంచె కట్టుకొని వాలుకుర్చీలో కూర్చున్న శాస్త్రి చేతికి కాఫీకప్పు అందించింది భార్య పావని.

కప్పు అందుకుని భార్యను తృప్తిగా చూసాడు.. నుదుటన నిండుగా ఎర్రని బొట్టు, అక్కడక్కడ నెరిసిన వెంట్రుకలు. చెరగని చిరునవ్వుతో లక్ష్మీదేవిలా కనిపించింది. వారికి ముగ్గురు సంతానం. ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. అందరూ కాలేజీ చదువులకు చేరుకున్నారు.

"ఏమండీ, మన చిన్నోడి ఫీజు కట్టాలి" అంది పావని

"జీతం రాగానే మొదటి రోజే కట్టేద్దువుగానీ" అన్నాడు.

"ఎప్పుడూ ఇదే సమస్య మనకు. ఆ సుబ్బారావుగారు చూడండి, సాయంత్రం మూడు బ్యాచ్‌లు, ఉదయం మూడు బ్యాచ్‌లు ఇంట్లో ట్యూషన్ చెప్తున్నారు, చక్కటి సంపాదన. మీరేమో ట్యూషన్లు చెప్పనంటారు. మీకు మంచి పేరు ఉంది. మీరూ ట్యూషన్లు చెప్తే మనకు బాగుంటుంది కదా" అంది మెల్లిగా సముదాయించుతూ.

"పిచ్చిదానా, స్కూల్లో వున్న సమయంలో మనం చక్కగా చెప్తే ఎవరూ ఇంటికొచ్చి ట్యూషన్ చెప్పించుకునే అవసరం రాదు" అన్నాడు చిన్న చిరునవ్వుతో.

"అంటే మిగతా వారందరూ చెప్తున్నారుగా, మీకెందుకు ఆ డబ్బులు చేదు?" అంది పావని నిష్టూరంగా కొంగుతో మొహం తుడుచుకుంటూ.

"పావనీ, నా కంటూ కొన్ని సిద్ధాంతాలు, నమ్మకాలున్నాయి, నీకు తెలుసుగా" అన్నాడు పావనికేసి చూసి నవ్వుతూ.

"దానికెవరూ అడ్డుపడటం లేదండీ, మనకు డబ్బులు వస్తాయిగా" అంది.

"ఏం? మనకు జీతాలు రావడం లేదా? మనం న్యాయంగా చదువు చెప్పటానికి ప్రభుత్వం మంచి జీతాలిస్తోంది. మన ఖర్చులు తగ్గించుకుని, ఉన్నంతలో స్కూల్‌లో విద్యార్థులకు న్యాయం చేయాలి. అంతేగానీ స్కూల్లో సరిగ్గా పాఠాలు చెప్పకుండా, వాళ్లను ఇంటికి పిలిపించుకుని డబ్బులు సంపాదించడం సరైన మార్గం కాదు" అన్నాడు.

"సరే.. నా పిచ్చిగానీ ఇన్నేళ్లు విననివారు ఇప్పుడు మాత్రం వింటారా?" అని నవ్వి భర్తకేసి అభిమానంగా చూసి, ఖాళీ కప్పు తీసుకుని వంటింట్లోకి వెళ్లిపోయింది పావని.

కళ్లు మూసుకుని ఆలోచనల్లో పడి ఇరవై అయిదు సంవత్సరాలు వెనక్కి.. గతంలోకి వెళ్లిపోయాడు.

ఆ రోజు బి.ఈడీలో సీట్ వచ్చింది. ఇంట్లో శాస్త్రి తల్లి రుక్మిణి, తండ్రి నారాయణ, శాస్త్రిని గుడికి తీసుకెళ్లి దేవుడి మొక్కు తీర్చుకుని ఊపిరి పీల్చుకున్నారు.

ఈ చదువు అయిపోగానే నీకు ఉద్యోగం ఖాయమట కదురా కన్నయ్యా" అంది రుక్మిణి తృప్తిగా కొడుకు తల నిమురుతూ.

"అవునే అమ్మా" అన్నాడు శాస్త్రి తృప్తిగా.

"ఆ టీచర్ ఉద్యోగం వస్తే చాలు.. మన కుటుంబానికి దేవుడు పెద్ద సాయం చేసినట్లే. ఆ జీతంతో నీ జీవితం సాఫీగా గడిచిపోతుంది" అని నిట్టూర్చింది రుక్మిణి.

"గురువు ఉద్యోగం అంటే జీతంరాళ్లు కాదు రుక్మిణీ! అదో పెద్ద గురుతర బాధ్యత. వాడి జీవితంలో ఎన్నో వేల పిల్లల జీవితాలను తీర్చేదిద్దే అతి పవిత్రమైన కార్యం. అందులో ఎంతో మంది చేతుల్లో భావితరంలో దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఎంతోమంది పిల్లల జీవితాలలో వెలుగులు నింపాలి. ఒక గురువు చేసే పని అది. అంతేగానీ దాన్ని ఒక మామూలు ఉద్యోగంలాగ అనుకోకూడదు. సంపాదనే కావాలంటే ఇంకా చాలా.. చాలా ఉద్యోగాలున్నాయి" అని చెప్పి కొడుకు వైపు చూశాడు నారాయణ.

తండ్రి కళ్లల్లోకి కళ్లు పెట్టి గౌరవంగా చూసి "అవును.. నిజమే నాన్నగారూ" అన్నాడు శాస్త్రి.

కొన్ని సంవత్సరాల తర్వాత ఒకరోజు పోస్టుమన్ తెచ్చిన బ్యాంకు ఉద్యోగంలో భర్తీకమ్మనే ఉత్తరంతో ఇంట్లో సంతోషాలు వెల్లివిరిసాయి.

భార్య మొహం చూసాడు శాస్త్రి. పావని మొహం వెలిగిపోతూ ఉంది "ఈరోజు భలే శుభదినం కదూ" అంది.

"నాకు ఈ ఉద్యోగానికి వెళ్లాలని లేదు పావనీ" అన్నాడు కాఫీ చప్పరిస్తూ.

అది విని బిత్తరపోయింది పావని. "ఎందుకని.. జీతం పెరుగుతుంది. భవిష్యత్తులో ప్రమోషన్లుంటాయి. పైగా మీరింకా ఇద్దరు చెల్లెళ్ల పెళ్లిళ్లు జరిపించాలి. ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు" అంది.

"ఏమో పావనీ! నాకీ టీచర్ ఉద్యోగం చాలా తృప్తినిస్తోంది. ఎంతోమంది విద్యార్థులకు భవిష్యత్తు ఇవ్వచ్చు" అన్నాడు నిట్టూరుస్తూ.

**"మన విద్యార్థుల తల్లిదండ్రులను, డిఇఓను కలిపి ఓ మీటింగ్ పెట్టి వారి సహకారంతో ముందుకు వెళ్లొచ్చు" అని చెప్పి అందరి వైపు చూసాడు శాస్త్రి. "ఆలోచించాల్సిన విషయం" అన్నాడు ప్రకాష్.**

"కానీ బ్యాంకు ఆఫీసర్‌గా మీకు, మాకందరికీ ఆర్థికంగా ఉన్నత స్థితిలోకి వెళ్లడానికి వుండే సౌలభ్యం ఇప్పుడున్న ఉపాధ్యాయ వృత్తిలో ఎక్కడుంది?" అడిగింది దిగాలుగా.

ప్రతి పనిలో మానసిక ఆనందం, జీవితంలో తృప్తి కూడా అవసరం పావనీ, నువ్వే అర్థం చేసుకో. నాకిక్కడ ఉదయం లేచిన దగ్గర్నుంచి ఎంతో మంది బీద విద్యార్థులకు, తెలివైన పిల్లలకు వారి భవిష్యత్తుకై మంచి మార్గం చూపుతున్నాను. అందులో వున్న ఆనందం ఇంకెక్కడొస్తుంది చెప్పు" అని చెప్పి కళ్లు మూసుకున్నాడు.

కాసేపు భర్తకేసి ప్రేమగా చూసి చిరునవ్వు నవ్వి లోనికెళ్లిపోయింది పావని.

"ఏమండీ" అన్న భార్య పిలుపుతో గతంలో నుంచి ఈ లోకంలోకి వచ్చాడు శాస్త్రి. "ఏంటి?" అన్నాడు ఉలిక్కిపడి భార్య వైపు చూసి.

"రండి, చపాతీలు వేడిగా వున్నాయి" అంది. లేచి డైనింగ్ టేబుల్ వద్దకు నడిచాడు శాస్త్రి.

ఆ రోజు వర్షం విపరీతంగా కురుస్తోంది. పైగా హోరుగాలి. దాంతో ఆ గాలికి వర్షంజల్లు ఎడా పెడా కొట్టసాగింది. రోడ్లన్నీ వర్షంతో మునిగి మోకాలి లోతున పారుతూ వున్నాయి నీళ్లు.

స్కూల్‌లో విద్యార్థులు దాదాపు రాలేదు. ప్రధానోపాధ్యాయుడి గదిలో ఉపాధ్యాయులందరూ కూర్చొని బడిని ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చు? అని చర్చించుకుంటున్నారు. అందరూ తలా ఒక సూచన చేసారు.

శాస్త్రి మాత్రం ఏమీ మాట్లాడకుండా మౌనం ఉండటం గమనించిన ప్రధాన ఉపాధ్యాయులు రామయ్య "శాస్త్రీ! మీరేంటి? ఏమీ చెప్పటం లేదు" అన్నాడు.

ఆ మాట విని లేచి నించున్నాడు శాస్త్రి. అందరూ మాట్లాడుకోవడం మానేసి ఆసక్తిగా శాస్త్రి వైపు చూసారు.

అప్పుడు చెప్పటం మొదలుపెట్టాడు శాస్త్రి.

"ముందుగా విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు కావాలి. వారికి విషయం సులభంగా అర్థం కావడానికి దేశ, ప్రపంచ పటాలు అవసరం. సైన్సుకు సంబంధించినవైతే, అవెంత అత్యావశ్యకమో మనందరికీ తెలుసు. ముఖ్యంగా సైన్సు పరికరాలు కొన్ని వుంటే పై తరగతిలో వాళ్లకు వాటి గురించి అవగాహన పెరిగి విజ్ఞానం పెంపొందమే కాక వికాసం కూడా పెరుగుతుంది" అని చెప్పటం ఆపి అందరి వంక చూసాడు శాస్త్రి.

చాలా మంది ఉపాధ్యాయులు నిరాసక్తతతో చూసారు, కొందరు అసహనంగా కదిలారు.

"అవన్నీ ప్రభుత్వం చూసుకోవాలి, మన పని కాదు" అన్నాడు లెక్కల మాస్టారు అప్పారావు.

"అవును, అవన్నీ పెద్ద పెద్ద ప్రణాళికలు, మనకెందుకు?" కాస్త చిరాకుగా అన్నాడు సోషల్ మాస్టర్ సూరి.

అవన్నీ గమనించిన ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ శాస్త్రి వైపు చూసి "నిజమే మీరు చెప్పిన అంశాలు బాగున్నాయి కానీ వాటికి బోలెడు ఖర్చు. మనకంత బడ్జెట్ ఎక్కడుంది?" అన్నాడు నిస్సహాయంగా మొహం పెట్టి.

"ఇవన్నీ చొప్పదంటు ప్రణాళికలు. వాటి గురించి మాట్లాడటం వల్ల సమయం వృథా" అన్నాడు తెలుగు మాస్టర్ వర్మ.

శాస్త్రి అందరి వైపు నవ్వుతూ చూసి "ప్రణాళిక అంటూ ఒకటుంటే మనం ముందడుగు వేయొచ్చు" అన్నాడు.

"అబ్బా శాస్త్రీ, నీవన్నీ పగటి కలలు. ఊరుకో" అన్నాడు హిందీ మాస్టర్ ప్రకాష్ వెక్కిరింతగా నవ్వుతూ.

బాధగా చూసాడు శాస్త్రి. "మన ఊరి పంచాయితీని కూడా కలుపుకుని వారిని కూర్చోబెట్టి ఈ విషయాలను వారి దృష్టికి తెస్తే బాగుంటుంది" అన్నాడు.

ఆ మాట విని ఆలోచనలో అందరూ ఆలోచనలో పడ్డారు.

"అంతేకాదు, మన విద్యార్థుల తల్లిదండ్రులను, డిఇఒను కలిపి ఓ మీటింగ్ పెట్టి వారి సహకారంతో ముందుకు వెళ్లొచ్చు" అని చెప్పి అందరి వైపు చూసాడు శాస్త్రి.

"ఆలోచించాల్సిన విషయం" అన్నాడు ప్రకాష్.

"ప్రస్తుతం మనం ఒక్కొక్కరం అన్ని రకాలైన విషయాలను బోధిస్తున్నాం. అది సమంజసంగా లేదు. ఉదాహరణకు నేను సైన్స్ చదివాను, కానీ హిస్టరీ కూడా చెప్పాల్సి వస్తోంది. గేమ్స్ టీచర్ లేరు. నా వ్యక్తిగత అభిలాషతో నేను చేస్తున్నాను. నా లాగా చాలా మందికి మన స్కూల్‌లో ఇదే సమస్య. దాన్ని కూడా పరిష్కరించాలి. ఎలా అనేది అందరం ఆలోచించాలి" అని చెప్పి కూర్చున్నాడు శాస్త్రి.

"త్వరలో నీకు ప్రమోషన్ వచ్చి హెడ్ మాస్టర్ అవుతావుగా, అప్పుడు నువ్వు పరిష్కరించుదువుగానీ" అని వెకిలిగా నవ్వాడు రాజయ్య.

రాజయ్య అన్నట్టుగానే ఆరు నెలల తరువాత శాస్త్రి అదే స్కూల్‌లో హెడ్‌మాస్టర్ అయ్యాడు. ఒక వారం తర్వాత ఆ ఊరి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులను ఆహ్వానించాడు శాస్త్రి. వారితో, పాఠశాల అధ్యాపకులతో కలిసి ఒక సమావేశం ఏర్పాటు చేసాడు. పాఠశాల అభివృద్ధికి కావాల్సిన సహకారాన్ని అర్థించాడు. విద్యార్థులకు అవసరమైన పరికరాలు కావాలి, వాళ్లను చదువు నుండి మనసు దారి మళ్లే పనులు చెప్పవద్దని అర్థించాడు.

శాస్త్రి మాటలు విన్న గ్రామపెద్దలు ఆశ్చర్యపోయారు. ఊరినుండి చందాలు వసూలు చేసి ఇస్తామని మాట ఇచ్చారు. శాస్త్రి చెప్పే విషయాల్లో వున్న నిజాన్ని, అందులో గల శాస్త్రి నిజాయితీని గమనించారు.

"వచ్చే సంవత్సరం ప్రాథమిక పాఠశాలను తప్పనిసరిగా ఉన్నత పాఠశాల చేస్తాను. అయితే మీరు ఎవరు కూడా మీ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపనని నాకు మాట ఇవ్వండి" అన్నాడు శాస్త్రి.

"మీరు విద్యార్థులకు మంచిగా పాఠాలు చెప్తుంటే, మీ మాట ప్రకారం పిల్లలను ఇక్కడే ఉంచుతారు సార్" అన్నాడు ప్రెసిడెంట్ రంగయ్య.

"ఆ కృషి మే చేస్తాం. దానికి నేను మా అధ్యాపకుల తరపున హామీ ఇస్తున్నాను" అని చెప్పి ముందు కూర్చున్న అధ్యాపకుల వైపు చూసాడు శాస్త్రి. అందరూ అవునని తలలూపారు.

ఆ రోజుతో సమావేశం ముగించి తృప్తిగా ఇంటికి వెళ్లాడు శాస్త్రి. గేట్ బయట మెట్ల పక్కన కూర్చున్న ఒక విద్యార్థిని గమనించి పిలిచాడు.

ఆ అబ్బాయి భయపడుతూ వచ్చి శాస్త్రి ముందు నిలబడ్డాడు. "ఏంటి? ఇంకా ఇంటికెళ్లకుండా ఇక్కడే వున్నావ్?" అడిగాడు. "రేపటి నుండి స్కూల్‌కు రావద్దని చెప్పారు సార్" అన్నాడు ఏడుపు మొహంతో.

"ఏం జరిగింది?" అన్నాడు.

"స్కూల్ ఫీజు కట్టలేదు సార్ మా నాన్న" అన్నాడు తల వంచుకుని.

"అదేంలేదుగానీ నువ్వు రోజూ రా, ఏ క్లాస్ నీది?" అడిగాడు.

చెప్పాడా విద్యార్థి. "సరే. రోజూ స్కూల్‌కి రా, మానొద్దు. మీ సార్‌కి నేను చెప్తాలే.

ఒక సంవత్సర సమయంలో పాఠశాల చాలా అభివృద్ధి చెందింది. విద్యార్థుల సంఖ్య పెరిగింది. శాస్త్రి పై తరగతులకు కొన్ని పాఠాలు చెప్పసాగాడు. సైన్స్ విద్యార్థులకు చిన్న ల్యాబ్ ఏర్పాటు చేసాడు. పెద్ద తరగతుల విద్యార్థులకు, చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఉదయం, సాయంకాలం ప్రత్యేక బోధన ఏర్పాటు చేయించాడు.



పాఠశాల మానకుండా ప్రతీరోజు వచ్చిన విద్యార్థులకు ప్రతీ నెల బహుమతులు అందచేయడం మొదలుపెట్టాడు. మెల్లగా పాఠశాలలో విద్య మీద అందరికీ ఆసక్తి హెచ్చి స్కూలుకి మంచి పేరు రావడం మొదలైంది.

గ్రామ ప్రజల సహకారంతో, విద్యార్థుల తల్లిదండ్రుల సహాయంతో అదనపు తరగతుల భవనం కట్టించాడు.

ఆ రోజు శాస్త్రి రాత్రి భోజనం చేసి వరండాల్లో కూర్చుని పావనితో మాట్లాడుతూ వుండగా ఇద్దరు వ్యక్తులు వచ్చారు.

వాళ్లలో ఒకరు గొంతు సవరించుకుని చెప్పారు "నేను ప్రైవేట్ స్కూల్ అండ్ కాలేజీ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఇతను సెక్రటరీ" అని చూపించి నమస్కారం పెట్టారు.

"మీరు వచ్చిన పని" అడిగాడు శాస్త్రి.

"మీరు వచ్చిన తర్వాత మా పాఠశాలల్లో పిల్లలు తగ్గిపోతున్నారు. మీరు మాకు సహాయం చేస్తే, మేం మీకు సహాయం చేస్తాను" అన్నారు.

"మీకు నేను ఏ విధంగా సహాయం చేయగలను?" శాస్త్రి అన్నాడు.

"మీరు కొత్త విద్యార్థులను తీసుకోకుంటే మీ స్కూల్ మీద ఆసక్తి తగ్గి మేం పుంజుకుంటాం. దానికి ప్రతీ నెలా మేం మా తరపున పెద్ద మొత్తం అందచేస్తాం" అని సెక్రటరీ అనగానే శాస్త్రి నరాలు బిగుసుకున్నాయి. మీరు ఇక లేచి బయలుదేరండి, కాస్త పనుంది" అని చెప్పి లేచి నిలబడ్డాడు శాస్త్రి.

"మరోసారి ఆలోచించండి" అని ఓ విజిటింగ్ కార్డు బల్ల మీద పెట్టి వెళ్లిపోయారిద్దరూ.

ఆఫీసు గదిలో కూర్చుని పని చేసుకుంటూ ఉండగా టేబుల్ ఉన్న ఫోన్ మోగింది అది తీసి హలో అన్నాడు శాస్త్రి.

"మీ పేరు ఉత్తమ జాతీయ ఉపాధ్యాయునిగా ఎంపికైంది. మీరు దానికి అవసరమైన పేపర్లు పంపండి" అంది అటు నుండి డీఈఓ కంఠం.

"నాకు వాటి పైన ఆసక్తి లేదు. దయచేసి మీరేమీ అనుకోవద్దు" అన్నాడు వినమ్రంగా.

"మీ లాంటి వారికి ఆసక్తి లేకపోతే అది అనర్హులకు లభిస్తుంది. కనుక ఆ ఫారాలు నింపి పంపండి శాస్త్రిగారు" అంది డీఈఓ.

"సరేనండీ! అలాగే పంపిస్తాను" అని ఫోన్ పెట్టేసాడు శాస్త్రి.

కొన్ని రోజులకు శాస్త్రి ఆ బహుమతికి ఎంపికైనట్లు పేపర్లో వచ్చింది.

అవార్డు తీసుకోటానికి ఢిల్లీకి వెళ్లి, అది తీసుకుని తిరిగి వచ్చాడు శాస్త్రి. అతని పేరు ప్రతి వార్తాపత్రికలో, టీవీల్లో వచ్చింది. కొన్ని నెలల తర్వాత ఒకరోజు స్కూల్ నుండి రాగానే కాఫీ తాగి భార్యను పిలిచాడు శాస్త్రి.

"ఏంటీ అలా దిగులుగా ఉన్నారు?" అంది పావని భర్త మొహం చూసి.

"వచ్చే నెల నా రిటైర్మెంట్" అన్నాడు శాస్త్రి.

"జీవితమంతా పని చేశారు, ఇక చాలు" అని భర్త మొహాన్ని కొంగుతో తుడిచింది.

.............

"శాస్త్రిగారూ, వచ్చే నెలనే కదా రిటైర్మెంట్? ఇక హ్యాపీగా ప్రశాంతంగా బతుకు గడపడమే" అంటూ నవ్వాడు ఎదురింటి సుబ్బారావ్.

"అవునండి" బలవంతంగా నవ్వు తెచ్చుకుని ముందుకు నడిచాడు శాస్త్రి.

వెంటనే శాస్త్రి మనసులో దిగులు మొదలైంది.

రాత్రి చపాతీలు తిని, ఆరుబయట మల్లెపందిరి కింద కూర్చున్నాడు శాస్త్రి. కాసేపటికి పావని వచ్చి ఇంకొక కుర్చీలో కూర్చుంది. "నెల రోజుల నుండి చూస్తున్నాను.. ఎందుకండీ అదోలాగ ఉంటున్నారు? స్కూల్లో ఏదైనా సమస్యా?"

"ఏమిటన్నావ్?"

"ఈ మధ్య ఎందుకు అదోలా ఉంటున్నారు?" అడిగింది మళ్లీ.

"నాకొచ్చే పీఎఫ్, గ్రాట్యుటీ చిన్నదాని పెళ్లికి సరిపోతాయి. ఇక చిన్నవాడి చదువు.. మరో మూడు సంవత్సరాలయితే అయిపోతుంది. రిటైర్మెంట్ ఇంకొంత కాలం తర్వాత ఉంటే బాగుండేది" అన్నాడు.

............

ఆఖరు రోజు పదవీ విరమణ రోజు కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగింది. "మీరు చాలా అదృష్టవంతులు. మీకు జరిగినట్లుగా పదవీ విరమణ కార్యక్రమం ఎప్పుడూ, నేను ఎవరికీ చూడలేదు" గర్వంతో అంది పావని. వచ్చే నెల పెన్షన్ మొత్తం గురించి ఆలోచించసాగాడు శాస్త్రి. రేపటి నుండి ఖర్చులు తగ్గించాలి అనుకున్నాడు మనసులో.

"శాస్త్రిగారూ, వచ్చే నెలనే కదా రిటైర్మెంట్? ఇక హ్యాపీగా, ప్రశాంతంగా బతుకు గడపడమే" అంటూ నవ్వాడు ఎదురింటి సుబ్బారావ్. "అవునండి" బలవంతంగా నవ్వు తెచ్చుకుని ముందుకు నడిచాడు శాస్త్రి.

"భగవంతుడా.. నీవే దిక్కు" అని మొక్కుతూ కళ్లు మూసుకుని నిద్రకు ప్రయత్నించాడు.

రాత్రంతా దేవుడిని తలుస్తూనే వున్నాడు. తెల్లవారుజామున నిద్రపట్టింది. నిద్రలో కూడా అతడి కళ్లనుండి కన్నీళ్లు కారాయి.

మంచి నిద్రలో వుండగా పావని పిలుపుతో మెలకువ వచ్చింది శాస్త్రికి. కళ్లు తెరిచాడు. నిద్రలేమితో కళ్లు మంటగా అనిపించాయి. "మీ గురించి ఎవరో వచ్చారు చూడండి" అంది.

"వాళ్లను కూర్చోబెట్టు వస్తాను" అని లేచి పెరట్లోకి వెళ్లి అరగంటలో కాలకృత్యాలు తీర్చుకుని వచ్చాడు.

ముందు గదిలో కూర్చున్న వ్యక్తి లేచి నమస్కారం చేసి "సార్, మీ గురించి మా అయ్యగారు రత్నయ్య, మన ఎమ్మెల్యేగారు వచ్చారు. బయట కార్లో వున్నారు. మీరు సరేనంటే లోనికి తీసుకొస్తాను" అన్నాడు.

అది విని బిత్తరపోయిన శాస్త్రి "అరే.. బయట ఎందుకున్నారు. లోనికి రమ్మను" అని చెప్పి అక్కడున్న కుర్చీలు సరి చేసాడు. రత్నయ్య, ఆ ఊరి ఎమ్మెల్యే రాజాగారు లోపలికి అడుగు పెట్టి శాస్త్రికి వినయంగా నమస్కారం చేశారు.

రత్నయ్య చేతులు కట్టుకుని "సార్, నా పేరు రత్నయ్య మీ విద్యార్థిని సార్. వీరు మన ఎమ్మెల్యే రాజాగారు. పదవ తరగతిలో మేమిద్దరం మీ విద్యార్థులం సార్. ఆ సంవత్సరం నాకు స్కూల్‌ఫీజు తక్కువయితే మీరు ఇచ్చారు. నేను మళ్లీ తిరిగి ఇస్తే తీసుకోలేదు" అన్నాడు.

కళ్లద్దాలు సరి చేసుకుని వాళ్లిద్దరినీ తేరిపారా చూసాడు శాస్త్రి. చాలా కాలమైందిగా.. గుర్తుపట్టలేకపోయాను సారీ అన్నాడు శాస్త్రి చిరునవ్వుతో.

"సార్, నాకు రెండు సంవత్సరాల పాటు పుస్తకాలన్నీ మీరు ఇప్పించారు, అప్పుడు మేం చాలా బీదరికంలో వున్నాం" అన్నాడు ఎమ్మెల్యే రాజారావు. జేబులో నుండి రుమాలు తీసి కళ్లు తుడుచుకున్నాడు రాజారావు. మీరు చేసిన సహాయం, మాకు ప్రత్యేకంగా క్లాసులు తీసుకుని చదువు చెప్పిన విషయం ఎపటికీ మరువలేం" అన్నాడు రత్నయ్య.

శాస్త్రి మొహం సంతోషంతో విప్పారింది. మనసులో గూడు కట్టుకున్న దిగులు పోయింది. మీరు పెరిగి ఉన్నత స్థాయిలోకి వచ్చారు. అంతా భగవంతుడి దయ, నేను నా ఉద్యోగ ధర్మాన్ని పాటించాను" అన్నాడు తృప్తిగా.

మీతో చిన్న పని మీద వచ్చాం సార్. ప్రస్తుతం నేను రియల్ ఎస్టేట్‌లో స్థిరపడ్డాను. ఇక్కడ పక్క ఊరిలో బీద విద్యార్థులకు సరస్వతి విద్యాపీఠ్ అనే ఇంగ్లీష్ పాఠశాల స్థాపించాను" అని చెప్పాడు రత్నయ్య.

"నేను నిన్ననే రిటైర్ అయ్యాను. నేను ఏం చెయ్యగలను" అన్నాడు.

"అది తెలిసే వచ్చాం సార్. మీరు కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉండాలి. చాలా మంది మీ పేరు చెప్పారు, పైగా మీరు మా గురువులు. ఇప్పుడే కొత్తగా పెట్టాం కనుక ఎక్కువగా ఇచ్చుకోలేం, ప్రస్తుతానికి యాభై వేలు ఇస్తాం సార్" అన్నాడు ఎమ్మెల్యే రాజారావు. ఆశ్చర్యంతో నోట మాట రాలేదు శాస్త్రికి.

శాస్త్రి మౌనంగా వుండడం చూసి సార్, మీరు దయచేసి ఒప్పుకోవాలి అన్నాడు రత్నయ్య.

"నాకు కాలేజీ నడిపిన అనుభవం లేదు" అన్నాడు శాస్త్రి.

"మేం మీకు ఒక్కొక్కటిగా చెప్తాం. మీరు సీట్లో కూర్చుంటే చాలు. ప్రతిరోజు కాలేజీ వెహికల్ వచ్చి మిమ్మల్ని తీసుకెళ్తుంది. మీ లాంటి గురువులు దొరకడం మా అదృష్టం. మీరు కాదనకండి. ఇదుగోండి.. అడ్వాన్స్ లక్ష రూపాయల చెక్. మీ మీద మాకు పూర్తిగా నమ్మకం వుంది. నిన్ననే రిటైర్ అయ్యారుగా! వారం తర్వాత మీరు కాలేజీకి రండి సార్" అని చెప్పి నిలబడ్డారు. జరుగుతున్నదంతా విని కలో నిజమో తెలీని పరిస్థితిలో సరేనంటూ తలూపాడు శాస్త్రి.

సంతోషంతో వాళ్లు ఇద్దరూ లేచి రెండు చేతులెత్తి నమస్కారం చేసి బయటకు అడుగులు వేశారు.

తృప్తిగా నవ్వుతూ ఎదురుగా నిలబడ్డ పావనికేసి చూసి "రిటైర్మెంట్ అయ్యాక పెన్షన్‌తో మూడు సంవత్సరాలు బాబు చదువుకు ఎలా సర్దుబాటు చేయటం అని దాదాపుగా రెండు నెలల నుండి మానసిక వ్యథను అనుభవించాను పావనీ! ఆ దేవుడే పంపించాడు వీళ్లను" అని గద్గద స్వరంతో అంటూ భార్య మీద వాలిపోయి విలపించసాగాడు శాస్త్రి. ఇన్నాళ్లుగా అతని కడుపులో దాచుకున్న బాధ, దుఃఖం బయటకు తన్నుకుంటూ రాసాగింది.

"అవునండీ! దేవుడికి కళ్లున్నాయి. ఆయనెప్పుడూ న్యాయాన్ని కాపాడతాడు. మీరు చేసిన మంచితనం మీ వెంట వుంది. మీరు అందరికీ చేసిన సహాయం మిమ్మల్ని కాపాడుతుంది" అంది శాస్త్రి కళ్లు తుడుస్తూ.

వారం తర్వాత ఇంటి ముందు ఆగిన కాలేజీ కారెక్కి తృప్తిగా కూర్చున్నాడు శాస్త్రి. కారు వేగంగా కాలేజీ వేపు సాగిపోయింది.

# దళిత ఉద్యమ వైతాళికులు.. కుసుమ ధర్మన్న

**తెలుగు** సాహిత్యంలో, అంబేద్కరీయులైన కవులు, రచయితలు, విద్యాధిక మేధావులు డా॥ బాబాసాహెబ్ వాంఛిత ఆశయాలను మరింతగా సాకారం చేయడానికి సుప్రతిష్ఠితంగా సాహిత్య సృష్టి చేస్తున్నారు. గాంధీజీ రాజకీయ రంగ ప్రవేశానికి ముందే, 1910లో ఆంధ్రభారతి పత్రికలో వెలువడిన అజ్ఞాత కవి రచన 'మాలవాండ్ర పాట'గానీ, తర్వాత 1911లో మహాకవి గురజాడ 'లవణరాజు కల' వంటి రచనలు ఆంధ్ర దేశపు సామాజిక స్థితిగతులకు అద్దం పట్టాయి. 'అస్పృశ్యత ఆత్మహత్యా సదృశమని 1915లో వెలువడిన తొలి అస్పృశ్యతా కావ్యం మంగిపూడి వెంకట శర్మ రచించిన 'నిరుద్ధ భారతం' స్పష్టం చేస్తోంది. ప్రాచీన కాలం నుండి భారతీయ సాహిత్యంలో వర్ణ వ్యవస్థను నిరసించిన చైతన్యం చార్వాకం, బౌద్ధం, మధ్య యుగంలో వైష్ణవం, వేమన, తిరువళ్ళువార్, సర్వజ్ఞ, పోతులూరి వీరబ్రహ్మం, అన్నమయ్య వంటివారు కులాన్ని సందర్భవశాత్తు నిరసించినవారే. తెలుగులో కులాన్ని వీరబ్రహ్మం, వేమనలు సామాజిక దృక్పథంతో తీవ్రంగా వ్యతిరేకించారు. క్రమేపీ హేతువాదం, సంఘ సంస్కరణోద్యమంలో భాగమైంది. కందుకూరితో ఆరంభమైన మూఢ నమ్మకాలు, సామాజిక దురాచారాలపై పోరాటం బ్రాహ్మణ భావజాలపు ఆధిపత్యానికి అడ్డుకట్టలు వేసింది. అంబేద్కరీయుల భావజాలం విముక్తి, అస్తిత్వం, కుల, లింగ వివక్ష, ఆత్మగౌరవం తెలుగులో దళిత సాహిత్యం గేయం, పాటల రూపంలో వెల్లివిరిసింది. కుసుమ ధర్మన్న రాసిన 'మాకొద్దీ నల్ల దొరతనం' పాట, 'హరిజన శతకం', జయభేరి పత్రిక, క్రమేపీ దళిత, అంబేద్కర్ భావజాలం సుప్రతిష్ఠితం అయింది. 1930లో అంబేద్కర్ ఆంధ్రదేశ పర్యటన తరువాత భాగ్యరెడ్డివర్మ, ధర్మన్న లాంటి సాహితీవేత్తలు పునాదిగా, అర్ధ శతాబ్ది పైగా దళిత సాహిత్యం ప్రధాన స్రవంతిగా శక్తిమంతంగా, సమాజాన్ని నేటికీ శాసిస్తోంది. ఎదురు తిరిగి ప్రశ్నిస్తోంది.




1900లో జన్మించి, 1945 ఏప్రిల్ 17న కన్ను మూసిన కుసుమ ధర్మన్న తన జీవిత సర్వస్వం, నాటి జాతీయోద్యమ కాలంలో, దళితజాతి విముక్తికి అంకితం చేసిన త్యాగశీలి. ఆ రోజులలో, ఆంధ్రదేశాన్ని గాంధీ హరిజన సిద్ధాంతం ఆకట్టుకుంటున్న స్థితిగతులు కవులను ప్రభావితం చేస్తున్నాయి. క్రమేపీ అంబేద్కర్ మార్గమే శరణ్యమని, శ్రమదోపిడీ, ఆర్థిక స్వావలంబన, మనువాద ప్రతిఘటన, బ్రాహ్మణేతర ఉద్యమాలు సాహితీ పరంగా కూడా ఊపందుకున్నాయి.



తొలి దళిత పత్రికా సంపాదకుడు అయిన కుసుమ ధర్మన్న, దళిత ఉద్యమ వైతాళికునిగా నాటి దళితుల సామాజిక, ఆర్థిక అణచివేతలపై గొంతెత్తి గానం చేసిన ప్రజా వాగ్గేయకారుడు. ధర్మన్న పద్యం, గేయం, కథ, నవల, వ్యాసం యించుమించు అన్ని సాహితీ ప్రక్రియలలో దళిత వాదాన్ని ప్రతిధ్వనింప చేసారు. ధర్మన్న నాటి రచనలను పరిశీలిస్తే నేటికి శతాబ్ది కాలం నాటి ఆయన ముందు చూపు, ప్రస్తుత అంబేద్కరీయుల దళిత విముక్తి పోరాటాలకు ఎంతగా స్ఫూర్తివంతమైందో గ్రహించవచ్చు. నిమ్నజాతి విముక్తి తరంగిణి, మా కొద్దీ నల్లదొరతనం, నిమ్నజాతుల ఉత్పత్తి, మద్యపాన నిషేధం, అంటరానివాళ్ల(కథలు), మాల కాకి(నవల), హరిజన శతకం నాటి సమాజంలో దళిత ఉద్యమ చరిత్ర, సంస్కృతి, అభ్యుదయ భావాల పునరుజ్జీవనానికి కుసుమ ధర్మన్న ఎనలేని సేవలందించారు. దేశానికి స్వాతంత్ర్యం కోసం నాటి కవులు తమ రచనలతో కలాలను కొరడాలుగా ఝుళిపిస్తున్న దశాబ్దాలలో ముందుగా 'మా కొద్దీ నల్లదొరతనం' గేయంతో 'స్వాతంత్ర్యం వస్తే తెల్లదొరతనం పోయి నల్లదొరలు వస్తారు తప్ప దళితుల బతుకులలో పెద్దగా వొరిగేదేమీ ఉండదని శతాబ్దం క్రితమే ధర్మన్న చాటి చెప్పారు. "స్వాతంత్ర్యంబను స్వర్ణ సౌధమున, మా వాటా మాకిత్తురా, ఖాతా లేదని త్రోసిపుచ్చెదరో" అన్న జాషువా మహాకవి సంశయం, నాడే ధర్మన్న నిర్ధారించిన వైతాళిక మహోదయుడు.

జాతీయతా భావ స్ఫూర్తితో రాసినా, దీన జన దైన్యావస్థలు వివిధ సాహితీ రూపాలలో తెలుగు కవులు ప్రతిబింబింపచేసారు. జాషువా 'కొత్త లోకం' ఆవిర్భవింపచేసారు. బోయి భీమన్న 'దీపకథ', పల్లా దుర్గయ్య 'గంగిరెద్దు', నళినీకుమార్ 'పణవిపణి' క్రమేపీ ధిక్కార స్వరం వినిపింపచేశారు. 1909లో 'మాలవాండ్ర పాట 'భారతి'లో ప్రచురితమైనప్పటి నుండి "అందారు పుట్టిరి హిందమ్మ తల్లికి, అందారు ఒక్కటై ఉండాలి సక్కంగా" అంటూ అగ్రజాతి కులాధిక్యతను నిలదీయడం శక్తివంతంగా నేటికీ కొనసాగుతోంది. జాలా రంగస్వామి 'అంటరాని వారెవరు?'(1930), 'మేలుకొలుపు' (1930), 'మాలశుద్ధి'(1923), తొలి తెలుగు దళిత నవలగా 'రైతుపిల్ల'(1938) భావించవచ్చు. నక్కా చిన వెంకయ్య, 'హరిజన కీర్తనలు'(1935), 'అంటుదోషం'(1935), జాతి దైన్య స్థితి ప్రతిబింబింపచేసారు. 1938లో 'పాలేరు' నాటకం రచించారు.

తొలి తరం దళిత కవులు, రచయితల శతాధిక సంఖ్యలో ఉన్నా అజ్ఞాతంగా ప్రాచుర్యానికి నోచుకోకపోవడంతో తెలుగు సాహిత్యం ఎంతో కోల్పోయింది. తెలివి ఒక వర్గంవారి సొత్తు కాదని, సామాజిక అభ్యుదయాన్ని ఆకాంక్షిస్తూ, గాంధీ, అంబేద్కర్ల ప్రభావంతో అంటరానితనంపై జాతీయ దృక్పథం, మానవతా విలువలతో పోరాడారు. బీర్నీడిమోషే, గద్దం జోసెఫ్, దమ్ము తానయ్య, దుర్వాస మహర్షి, కె.సి.జాన్, ప్రకాశ్, మోదుకూరి జాన్సన్, జాలాది, నంబూరి, మల్లవరపు, తాటిపర్తి శామ్యూల్, గూడ అంజయ్య, దాసరి అమరేంద్ర, కృష్ణదాసు, పాడేటి జాన్సన్, దేవపుత్ర, ఆశావాది, భూపతి, కొలకలూరి.. ఇలా ఎందరో కవులు, రచయితలు తెలుగునాట ఒక వర్గం, కులం గుర్తింపుకు అతీతంగా ప్రతిభావంతమైన సాహితీ దీప్తితో అభ్యుదయ, విప్లవ మార్గాన్వేషణలో స్వాతంత్ర్యానంతరం చరిత్ర సృష్టిస్తున్నారు. కులం పేరిట ఆ ప్రతిభావంతులను ప్రస్తావించడం భావ్యం కాదనిపిస్తుంది.

**- జయసూర్య**

ఒకాయన గొప్పగా చెప్పారిలా.. "నా వైవాహిక జీవితంలో నా భార్యతో ఇప్పటివరకు ఒకే ఒక్కసారి గొడవ పడ్డానని"

"ఎప్పుడూ?" అని అడిగాను.

"పెళ్లయిన మరుసటి రోజే" అన్నాడు.

"అలాగా, ఆ తర్వాత మరెప్పుడూ నీ భార్యతో గొడవనేదే రాలేదా?" అని అడిగాను ఆశ్చర్యపోతూ.

"లేదు" అన్నాడతను.

"అదెలాగా?" అని అడిగాను.

"అప్పుడు ఆరంభమైన గొడవే ఇప్పటికింకా ముగియలేదు. అదే కొనసాగుతోంది" అన్నాడాయన.

నాకు ఆ మాటతో నవ్వొచ్చింది.

నన్ను నవ్వించడానికే ఆయన అలా చెప్పాన్నాడే తప్ప నిజానికి ఆయన గొప్పగానే వైవాహిక జీవితాన్ని సాగిస్తున్నారు.

ఓ కుటుంబం బాగానే ఉందంటే అందుకు కారణం భార్యేనని వేరేగా చెప్పక్కర్లేదు. సహజంగానే స్త్రీలకంటూ కొన్ని ప్రత్యేక గుణాలు ఉంటాయి.

ఓమారు బవేరియా దేశాధినేతకూ, జర్మనీ చక్రవర్తికి మధ్య గొడవ జరిగింది. జర్మనీ చక్రవర్తి ఏం చేసాడంటే భారీ స్థాయిలో సైన్యంతో తరలివెళ్లి బవేరియా రాజధానిని చుట్టుముట్టారు.

అయినప్పటికీ ఆయనకు కోపం చల్లారలేదు. బవేరియా దేశ రాజధానిని నేలమట్టం చేయాలని తీర్మానించు కున్నారు. ఆ సమయంలోనే ఆయన మనసులో ఎక్కడో మూల ఒకింత జాలి పుట్టింది. దాంతో ఆయన వెంటనే ఓ ప్రకటన చేశారు.

స్త్రీలకూ, పిల్లలకూ మాత్రం ఓ అవకాశం ఇస్తున్నాను. అదేంటంటే వారు తమ వీపు మీద వీలైన మేరకు సరకులు మోసుకుంటూ రాజధానిని విడిచిపెట్టి వెళ్లాలి. వారిని ఏమీ చేయబోము" అన్నది ఆ ప్రకటన.

ఆ తర్వాత ఆయన తన సైన్యాధిపతులను పిలిపించాడు. వారితో సమాలోచన చేశారు. స్త్రీలందరూ సరుకులతో వెళ్లిపోయిన తరువాత రాజధానిని ధ్వంసం చేయండని ఆదేశించారు. ఆడవాళ్లందరూ వెళ్లేవరకూ ఏమీ చేయవద్దన్నారు.

కాస్సేపటికే బవేరియా స్త్రీలందరూ తమ పిల్లా పాపలతో, సరుకులతో రాజధాని నుంచి బయటకు వెళ్లిపోతున్నారు.

అదంతా జర్మనీ చక్రవర్తి చూస్తూనే ఉన్నారు. జరుగుతున్నది చూసి ఆయన విస్తుపోయారు. ఇంతకూ అసలేం జరిగిందంటే–

బవేరియా మహిళలు వీపు మీద మోసుకోపోయినవి సరుకులు కావు... తమ భర్తలను. అవును.. ఎవరికి వారు తమ తమ భర్తలను వీపు మీద మోసుకుంటూ వెళ్లిపోయారు.

చివరగా బవేరియా రాజుని అతని భార్య వీపు మీద మోసుకుంటూ అతి కష్టం మీద ముందుకు నడుచుకుంటూ పోతోంది.

జర్మనీ చక్రవర్తి ఆ దృశ్యాన్ని చూసారు. ఆయన మనసు కరిగిపోయింది. బవేరియాను మన్నించి విడిచిపెట్టి తమ సైన్యంతో వెనక్కు వెళ్లిపోయారు.

భార్య గొప్పతనానికి ఇది ఒక నిదర్శనం. అయినప్పటికీ ఈ కాలంలో ఆ మేరకు జరుగుతుందా? అన్నది అనుమానమే! అటువంటి పరిస్థితి ఇప్పుడు వచ్చి, మీకు వీలున్న మేరకు వీపు మీద సరుకులు మోసుకుంటూ పొమ్మనమని చెప్తే వారిలో చాలా మంది టీవీలను మాత్రమే మోసుకుంటూ పోతారనుకుంటాను.

# గృహిణులు తలచుకుంటే..!



..................

అప్పుడెప్పుడో మెక్సికోలో గృహిణులందరూ కలిసి ఓ పోరాటం చేశారు. అది పత్రికల్లో చదివాను.

ఏం పోరాటమంటే– ఓ రోజు ఇంటి పనులను పూర్తిగా మానేసారట. భర్తలందరినీ వంటా, వార్పూ మొదలుకుని ఇంటి పనులన్నింటినీ చెయ్యమని, వారు పనులు చేస్తుంటే అది చూసి సంతోషించాలనుకున్నదే ఆ గృహిణుల పోరాటం.

అనుకున్నట్టే గృహిణులు సంతోషించారని కూడా పత్రికల్లో చదివాను. ఎందుకోసం ఇలా చేశారని? విలేకరులు అడిగితే గృహిణులు ఏకమై ఇంటిపని అనేది కుటుంబానికి మాత్రమే కాదు, సమాజానికి ఎంతో ముఖ్యమైనది అని తెలుసుకోవడం కోసం అలా తాము పోరాటం చేసామని చెప్పారు. ఈ పోరాటంతోనే అక్కడ మహిళలకు పురుషులకు సమానంగా హక్కులు కల్పించడం జరిగిందట.

అయితే మన ఊళ్లో ఆ మేరకు పోరాటాలంటూ ఏవీ అక్కర్లేదు. ఎందుకంటే, ఇప్పటికే పలు కుటుంబాల్లో ఇంటి పనులను మగవారే కనీస బాధ్యతగా భావించి చేస్తున్నారు కనుక.

అదలా ఉండనిచ్చి ఓ విషయం చెప్తాను. ఓ మహిళ తన భర్త విషయంలో ఓ ఆరోపణ చేసింది.

"ఎప్పుడు చూసినా నా ఇల్లు, మా బంగళా, నా కారు, నా తోట.. ఇలాగే చెప్తున్నారు కానీ ఎప్పుడైనా ఇది మనిద్దరిదీ అని చెప్తున్నారా?" అని అడిగిందా మహిళ తన భర్తను.

ఆ మాటతో భర్త తన భార్య వంక చూసాడు. "సరే చెప్తాను.. ఏదీ మన పంచ, మన బనియను తీసుకురా!" అని అన్నాడట!

**- యామిజాల జగదీశ్**

# ఉగ్రవాదం ప్రపంచానికే ముప్పు



**భూమిపై** మానవుడు ఉద్భవించినప్పుడు బహుశః కులాలు, మతాలు ఉండలేదనుకుంటా. రానురాను మనుగడ, జీవనోపాధి కోసం మానవులు వృత్తులను అలవరుచుకున్నారు. ఆ వృత్తుల పేర్లతోనే కులాలు ఏర్పడ్డాయి. ఆ తరువాత మతాలు పుట్టుకొచ్చాయి. ఇంతవరకు బాగానే ఉంది. మానవుడిలో అహంకారం, స్వార్థం మొదలైంది. తమ మతమే గొప్పదని, ఇతర మతాలను విమర్శించడం మొదలైంది. ఈ మతపిచ్చి నుండి ఉగ్రవాదం ఉద్భవించింది. ఇజ్రాయిల్, సిరియా, ఇరాన్, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ లాంటి ముస్లిం దేశాలు ఉగ్రవాదాన్ని పెంచి పోషించి సంస్థలకు ఆశ్రయం కల్పించాయి. పర్యవసానంగా 'ఐఎస్ఐఎస్', 'ఇస్లామిక్ స్టేట్, నేషనల్ తేవీత్, జమాల్, అల్‌ఖైదా, తాలిబన్, ఇస్లామిక్ రాడికల్స్, హిజ్బ్‌ఉత్ తహ్రీర్" లాంటి ఉగ్రవాద సంస్థలు ఏర్పడ్డాయి. మత పిచ్చితో ఇటువంటి సంస్థలకు తమ తమ దేశాలలో స్థానం కల్పించడమే కాకుండా పెంచి పోషించాయి. దాంతో ఈ ఉగ్రవాద సంస్థలు రెచ్చిపోయి మారణహోమాన్ని సృష్టిస్తూ వస్తున్నాయి. యునైటెడ్ స్టేట్స్, న్యూయార్క్ సిటీలోని మన్‌హటన్ ప్రాంతంలో 110 అంతస్తుల వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై 11.9.2001 రోజున ఉ.8.46 ని॥ల నుండి 10.28 ని॥ల వరకు నాలుగు విమానాలతో దాడి జరిగింది. అందులో 2996 మంది ప్రాణాలు కోల్పోగా, దాదాపు ఆరు వేల మంది క్షతగాత్రులయ్యారు. ఈ దాడి వల్ల 10 మిలియన్ డాలర్ల ఆస్తి బుగ్గిపాలైంది. ఈ ఉగ్రదాడి ఆల్‌ఖైదాకు చెందిన ఒసామా బిన్‌లాడన్ అనే తీవ్రవాది నేతృత్వంలో జరిగింది. ఆఫ్ఘనిస్తాన్‌లో ఉండి రూపకల్పన చేసాడు. 13.12.2001 నాడు మనదేశ పార్లమెంటుపై జైషే మహమ్మద్ ఆధ్వర్యంలో ఐదుగురు టెర్రరిస్టులు మారణాయుధాలతో దాడి చేసారు. మన సిఆర్‌పిఎఫ్ జవాన్లు కమలేశ్ కుమార్, సంతోష్ కుమార్‌లు ధైర్యసాహసాలతో అడ్డుకొని వారిని పార్లమెంటు లోపలికి వెళ్లకుండా ఆపారు. లేకుంటే చాలా ప్రాణ నష్టం జరిగి ఉండేది. అయినా కూడా టెర్రరిస్టులతో పాటు 14 మంది ప్రాణాలు కోల్పోయారు. 18 మంది క్షతగాత్రులయ్యారు. మూడవది 26.11.2008 నాడు ముంబాయిలోని తాజ్‌మహల్ హోటల్‌పై పాకిస్తాన్‌లో పెంచి పోషించబడ్డ లష్కరే-ఇ-తోయిబాకు చెందిన ఇస్లామిక్ టెర్రరిస్టులు ఎకె47, ఆర్‌డిఎక్స్ గ్రెనెట్ మొదలైన అత్యంత ప్రమాదకరమైన మారణాయుధాలతో దాడి చేసారు. 165 మంది సామాన్యులు, 9మంది టెర్రిస్టులు ప్రాణాలు కోల్పోయారు.



నాలుగవది పుల్వామా దాడి. 14.2.2019 నాడు 2547 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లతో జమ్ము నుంచి 78 బస్సుల కాన్వాయి హైవేపై శ్రీనగర్ వైపు వెళ్తుంటే 350 కి.ల పేలుడు పదార్థాలతో కారు వేగంగా వచ్చి 39 మంది జవాన్లు ప్రయాణిస్తున్న బస్సును ఢీకొట్టింది. 44 మంది జవాన్లు అమరులైనారు. ప్రపంచ దేశాలన్నీ కూడా మన భారత్‌కు అండగా నిలిచాయి చైనా తప్ప. పాక్‌పై ఎటువంటి ప్రతీకారం తీసుకున్నా మేం సహకరించగలమని అమెరికానే కాకుండా చాలా దేశాలు ప్రకటించాయి. ఎటువంటి ప్రతీకారమైనా తీసుకోండని కేంద్రం మన సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చింది. 26.2.2019 నాడు మూడు ప్రాంతాలను ఎన్నిక చేసుకొని 12 జెట్ విమానాలతో దాడి జరిపి సుమారు 200 నుండి 300 మంది పాక్ సైనికులను మట్టు పెట్టారు. ఐదవది శ్రీలంకలో 21.4.19 ఈస్టర్ సండే, కొలంబోలోని అంథోని చర్చిని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. వేలాది మంది ప్రార్థనలు జరుపుతుండగా పేలుళ్లు మొదలయ్యాయి.

మూడు లగ్జరీ హోటళ్లను కూడా పేలుళ్లతో కూల్చారు. 215 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోగా, 500 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. అందులో ముగ్గురు మన భారతీయులు కూడా ఉన్నారు. అప్పటినుండి శ్రీలంక ప్రభుత్వం ముస్లిం టెర్రరిస్టుల పట్ల చాలా జాగ్రత్త వహించడమే కాకుండా చివరకు ముస్లిం మహిళలు ధరించే బురఖాను కూడా నిషేధించింది.



కొన్ని రోజులు నుండి మన హైదరాబాద్‌లో ఉగ్రవాదులైన 'హిజ్బ్ ఉత్ తహ్రీర్" తిష్ట వేసారని, ఉగ్రవాద కార్యకలాపాలకు రూపకల్పన చేస్తున్నారు. ఈ విషయం పత్రికల్లో వస్తున్నది. మధ్యప్రదేశ్ రాష్ట్రం నుండి పోలీసులు వచ్చి ఓ ఐదుగురిని అరెస్టు చేసేవరకు ఈ విషయం మన పోలీసులకుగానీ, రాష్ట్ర ప్రభుత్వానికిగానీ తెలియదు. ఉగ్రవాదం అణచే విషయంలో మతాన్ని చూడవద్దు, రాజకీయాలు చూడవద్దు. అత్యంత కఠినంగా అణచివేయాలి. ఉగ్రవాదం వల్ల ఎంతో నష్టం జరుగుతుంది అనే విషయన్ని చాలా ముస్లిం దేశాలు సైతం గ్రహించాయి. ఈ ఉగ్రవాదం వల్ల ప్రపంచంలో భారతదేశం నష్టపోయినంతగా, మరే దేశం ప్రాణనష్టానికి, ఆస్తి నష్టానికి గురై వుండకపోవచ్చు. ఇందుకు ప్రధాన కారణం కాశ్మీరు. పాకిస్తాన్ కాశ్మీరును ఉగ్రవాదానికి విడిది గృహంలా వాడుకుంది. జమ్ముకాశ్మీరు రాష్ట్రంలో 370 ఆర్టికల్ విధించడం నెహ్రూ చేసిన అతిఘోరమైన తప్పిదం. జమ్మూకాశ్మీర్‌లో నేటికీ ఏదో ఒక మూలకు ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతూనే ఉన్నారు. ఇస్లామిక్ స్టేట్, లష్కరే–ఇ–తోయిబా, ఆల్‌ఖైదా, ఇస్లామిక్ రాడికల్స్, తాలిబాన్ మొదలైన మత ఛాందస సంస్థల ఉద్దేశం ఏమిటి? ప్రపంచంలో ఒకే ఒక ముస్లిం మతమే ఉండాలా? వాళ్లు అనుకుంటున్నట్టు ఎప్పటికీ కుదరదు. ఎవరి మతం వారికి గొప్ప. ఇస్లామిక్ మతం కూడా గొప్పదే. ఇతర మతాల వారిని ప్రేమించమని, గౌరవించమనే అన్ని మతగ్రంథాలు బోధిస్తున్నాయి. మరి ఈ ఉగ్రవాద సంస్థలవాళ్లు చేస్తున్నదేమిటి? ఒసామా బిన్‌లాడన్, సద్దాంహుసేన్ లాంటివారు ఉగ్రవాద సంస్థలను పోషించారు. సద్దాంహుసేన్‌ను అరెస్టు చేసి, ఉరిశిక్షతో హతమారిస్తే, ఒసామాబిన్ లాడెన్‌ను పాకిస్థాన్‌లో అతని రహస్యగృహంలోనే అంతమొందించారు.



ఉగ్రవాదాన్ని అణచివేయడంలో ఒకవిధంగా కేంద్రప్రభుత్వం విజయాన్ని సాధించిందనే చెప్పొచ్చు. ఇప్పుడు పాకిస్తాన్ ఏకాకిగా మిగిలిపోయింది. ముస్లిందేశాలు సైతం పాక్ ఉగ్రవాద వైఖరిని విమర్శిస్తున్నాయి. ఆఫ్ఘనిస్థాన్ దేశాన్ని ప్రస్తుతం తాలిబన్లు పరిపాలిస్తున్నారు. ప్రపంచదేశాలు ఆ దేశానికి ఆర్థికంగా సాయం చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో అక్కడి ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 370 ఆర్టికల్ రద్దుతో జమ్ము కాశ్మీర్ ప్రాంతంలో ఉగ్రవాదం అంతరించింది. యు.పి. రాష్ట్రంలో మొదలైంది. కానీ యు.పి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ టెర్రరిస్టులను ఎన్‌కౌంటర్ చేయడం, వాళ్ల భవంతులను బుల్డోజర్లతో కూల్చడం, వాళ్ల ఆస్తిపాస్తులను వశపర్చుకోవడంతో యు.పి.లో ఉగ్రవాదం అంతరించిపోయింది. ఇప్పుడు మన హైదరాబాద్‌పై కన్నుపడింది.



ఏది ఏమైనా ఉగ్రవాదాన్ని అణచివేయడంలో మతాన్ని చూడొద్దు. రాజకీయాల్ని చూడొద్దు. కఠినంగా అణచివేయాలి. ఎన్‌కౌంటర్ చేయడానికి వెనకడుగు వేయకూడదు. అప్పుడే మన దేశం పది కాలాల పాటు ప్రశాంతంగా ఉంటుంది. కాశ్మీరు నరకం కాదు, భూతల స్వర్గం అని ప్రపంచానికి చాటినవారమవుతాం.

**- మునిగంటి శతృఘ్నచారి**

# వారఫలం



పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



శత్రువుల వల్ల స్వల్ప ధన నష్ట సూచనలున్నాయి. విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. వాహన యోగం. వృధా సంచారం చేస్తారు. ఉద్యోగులకు ఆర్థికంగా బాగుంటుంది. కుటుంబ పేరు ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. వృత్తి రంగాల్లో పని చేసేవారికి బాగుంటుంది. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. చర్చలు ఫలిస్తాయి.

## వృషభం



అనుకున్నది సాధించలేకపోవచ్చు, నిరాశ చెందకండి. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉద్యోగాభివృద్ధి బాగుంటుంది. స్త్రీలకు అధిక శ్రమ. సామాజిక సంఘర్షణకు లోనవుతారు. కుటుంబ సమేతంగా విందు-వినోదాల్లో పాల్గొంటారు. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం చెప్పదగిన సూచన. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి.

## మిథునం



ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. అకారణంగా మానసికంగా చింతిస్తారు. శుభ కార్యాలకు హాజరవుతారు. ఉద్యోగులకు పదోన్నతి లభించే సూచనలున్నాయి. స్త్రీలకు శుభ యోగం. అన్ని వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. సామాజిక న్యాయం కోసం కృషి చేస్తారు. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ సమాచారం అందుకుంటారు.

## కర్కాటం



మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. ఉన్నతాధికారుల మెప్పు లభిస్తుంది. ఆరోగ్య సమస్యలు తీరి ప్రశాంతత లభిస్తుంది. స్త్రీలకు అనుకోని సమస్యలు ఎదురవుతాయి. గృహ సమస్యలు తీరి మానసిక ప్రశాంతత లభిస్తుంది. క్రయ-విక్రయాలు లాభదాయకంగా ఉంటాయి. శుభ కార్యాల్లో పాల్గొంటారు. ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు.

## సింహం



విద్యార్థులకు శుభ యోగం. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. ఖర్చులు అధికంగా ఉంటాయి. కుటుంబ పేరు ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. ఓర్పు అలవరచుకోవడం అత్యంతావశ్యకం. తీర్థ యాత్రలు చేస్తారు. వృత్తి రంగాల్లో వున్నవారికి ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయి. ఉద్యోగులు శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు.

## కన్య



వృత్తి ఉద్యోగులకు లాభదాయకంగా ఉంటుంది. అయినా అకారణంగా ఆందోళనకు లోనవుతారు. ధర్మ రక్షణకై కృషి చేస్తారు. ఆరోగ్య సమస్యలుంటాయి ప్రముఖులను సందర్శిస్తారు. దూర ప్రాంత ప్రయాణ సూచనలు అధికం. వృథా కాలక్షేపం చేయడం ఏమాత్రం మంచిది కాదు. ఆకస్మిక సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. ధన వృద్ధి.

## తుల



విద్యార్థులకు అపూర్వ విజయం లభిస్తుంది. ఉద్యోగులకు ఉన్నతాధికారం లభిస్తుంది. అనుకున్నది సాధించలేకపోవచ్చు. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. ఆదాయానికి మించిన ఖర్చులున్నాయి. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఫలిస్తాయి. శుభ కార్యాలకు హాజరవుతారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలించే అవకాశాలున్నాయి.

## వృశ్చికం



డ్రైవింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండండి. శారీరక, మానసిక శ్రమ అధికం. ముఖ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. సొంతింటి స్వప్నం సాకారమయ్యే సూచనలున్నాయి. సంతానాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. స్త్రీల వల్ల సమస్యలు వచ్చే అవకాశాలున్నాయి. ప్రతికూలతలు ఎదురైనా ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగులకు ఉన్నతాధికారుల వత్తిడి ఉంటుంది, సంయమనంతో ఉండండి.

## ధనుస్సు



ఊహించని వార్తలు వింటారు. ముఖ్యమైన పనులు అసంపూర్తిగా ఆగిపోతాయి. వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. చోర భయం పొంచి వుంది కనుక ముఖ్యమైన పత్రాలు, విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి. గృహ, భూ వసతి ఏర్పాటు చేసుకుంటారు. వారాంతంలో వ్యాపారులకు రుణాలు లభిస్తాయి. ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి.

## మకరం



రుణాలు లభిస్తాయి. వ్యాపారులకు యథాతథంగా ఉంటుంది. శుభ కార్యాలకు హాజరవుతారు. భాగస్వామ్య వ్యాపారులకు ఆశించిన ఫలితాలు ఉండకపోవచ్చు. ప్రముఖులను సందర్శిస్తారు. స్త్రీలకు శుభ యోగం. ఆరోగ్య, ఆహార సలహాలు-సూచనలు పాటించండి. దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తి అవుతాయి.

## కుంభం



ఉద్యోగులకు ఆర్థికంగా బాగుంటుంది. కుటుంబ సమస్యలు తీరి ప్రశాంతత లభిస్తుంది. వృత్తి రంగాల్లో వున్నవారికి ఆశించినట్లుగా ఉంటుంది. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం మంచిది. భాగస్వామ్య వ్యాపారులు సామరస్యంతో సమస్యలు పరిష్కరించుకుంటారు. ప్రభుత్వ సంబంధమైన పనులు నిర్విఘ్నంగా పూర్తవుతాయి.

## మీనం



క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి. రుణాలు లభిస్తాయి. ఉద్యోగులు ఉన్నతాధికారుల ప్రశంసలు పొందుతారు. శుభ కార్యాలకు అనుకూలమైన సమయం. ఆకస్మిక సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. చిరు వ్యాపారులకు పోటీ ఎదురైనా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. బాల్య మిత్రులను కలుసుకుంటారు. వృత్తి రంగాల్లో వున్నవారికి చిన్న చిన్న సమస్యలు ఎదురవుతాయి.




## లెక్కలు కూడా రావు

లీనా: "భారతీ! నువ్వు తెలుగు సరిగ్గా రాయడంలేదు. అందుకే చూసిరాత 30 సార్లు రాయమంటే 22 సార్లు మాత్రమే రాసావు. ఎందుకని?"

భారతి: "టీచర్! నాకు లెక్కలు కూడా సరిగ్గా రావు మరి".

## పైకి దారి..

దివ్య: "డాక్టర్! మన పేషెంట్స్‌కు కింది ఫ్లోర్‌లోనే బెడ్ కావాలట!"

డాక్టర్: ఎందుకు అలా అడుగుతున్నారు నర్స్! పై ఫ్లోర్స్‌లో అన్నీ బాగున్నాయి కదా!

దివ్య: లిఫ్ట్ దగ్గర 'పైకి దారి' అని చూసి, భయపడుతున్నారు డాక్టర్.

## తొందరగా వెళ్లాలని..

రజని: లిఖితా! ఈరోజు వంట నువ్వు చేస్తున్నావేంటి? మీ ఆయన చేయలేదా?

లిఖిత: అత్తయ్య కోసం నేనే వంట చేస్తున్నాను.

రజని: అత్తయ్య అంటే ఎంత గౌరవమో!

లిఖిత: గౌరవం కాదు.. తొందరగా మా ఇంట్లోంచి వెళ్తారని.

## లవర్ ఫొటో కనిపిస్తుందని..

రత్నం: విజయా! ఏమైంది? నీ గుండె ఎక్స్‌రే తీయొద్దు అన్నావట? ఎందుకని?

విజయ: గుండెలో దాచుకున్న నా లవర్ ఫొటో కనిపిస్తుందేమోనని భయంగా వుంది. అందుకే వద్దన్నాను.

## పాస్‌వర్డ్ తెలిసింది..

డాక్టర్: ఏమైంది? మొఖమంతా ఆ దెబ్బలేంటి?

నాని: మొబైల్ ఫోన్ ప్రమాదం జరిగింది డాక్టర్.

డాక్టర్: బ్యాటరీ పేలిపోయిందా?

నాని: కాదు డాక్టర్! మా ఆవిడకి నా మొబైల్ పాస్‌వర్డ్ తెలిసిపోయింది.

## తెలివితక్కువవాడే

నీరజ: ఏమండీ! నేను తెలివితక్కువవాడిని పెళ్లి చేసుకున్నానని మా ఫ్రెండ్స్ అంటున్నారు.

ప్రకాశ్: వాళ్లకి చెప్పు.. తెలివితక్కువవాడే నిన్ను పెళ్లి చేసుకుంటాడు అని.

**- ఈ.ఎస్.మాధవన్**

## నిన్ను చేసుకోవడమే..

"నేను గిన్నిస్ రికార్డు బుక్‌లో ఎక్కినవారినే పెళ్లి



చేసుకుంటాను" అంది పెళ్లిచూపులకొచ్చిన వారితో.

"నిన్ను పెళ్లి చేసుకోవడమే ఒక రికార్డు" అన్నాడు పెళ్లికొడుకు.

## మేమే పాస్ చేయిస్తాం!

సుబ్బారావు తన కొడుకు పదవ తరగతిలో ఫెయిల్ కావడంతో అతనికి ఈ ప్రపంచం అంతా తలకిందులయినట్లు అనిపించింది. కారణం వాడు పాసవుతాడన్న భరోసాతో లక్షలు కట్టి కార్పొరేట్ కాలేజీలో జాయిన్ చేశాడు.

ఇప్పుడు ఏం చేయాలో అతనికి అర్థం కాలేదు.

కాసేపటికి అదే కాలేజి నుంచి సుబ్బారావుకు ఫోన్ వచ్చింది.

"మీ కొడుకు ఫెయిలయ్యాడని తెలిసింది. అయితే అతన్ని పాస్ బాధ్యత మేమే తీసుకుంటామని, అందుకు అయ్యే ఫీజు గురించి చెప్పారు.

అది విన్న సుబ్బారావు నిజంగానే మూర్ఛపోయాడు.

**- కె.లహరి,** కరీంనగర్

## తోడు లేకుండా..

వెంకటేశ్: ఒరేయ్, వెంగళప్పా! మొన్నామధ్య ఒకరోజు సినిమాకు వెళ్లాను. అక్కడ మీ ఆవిడ కనిపించిందిరా.

వెంగళప్ప: తోడు లేకుండా మా ఆవిడ సినిమాకు వెళ్లదుగా!

సుందరం: నేను చెప్పేది కూడా అదే. మీ పక్కింటాయనతో సినిమాకి వచ్చింది.

వెంగళప్ప: ఇంతకూ ఏ సినిమానో చెప్పలేదు.

సుందరం: లేచిపోదాం రా!

వెంగళప్ప: ఆ సినిమాను నేను ఇంతకుముందే చూశాను.

## తినేశాగా!

భార్య: ఏమండీ! ఇక్కడ లైఫ్‌బాయ్ సోప్ పెట్టాను కనిపించడం లేదు.. మీరు చూశారా?

భర్త: ఆరోగ్యానికి మంచిదని టీవీలో యాడ్ చూసి తినేశా!

భార్య: ఆ..!

## ఊపిరాడదుగా..!

రాజు: నువ్వు ఎప్పుడూ విమానం ఎక్కవా? ఎందుకని?

వెంగళప్ప: విమానం ఎక్కేటప్పుడు పెద్దగా విశాలంగా బాగానే ఉంటుంది. ఆకాశంలోకి ఎగిరాక చిన్నగా అయిపోతుంది కదా. అప్పుడు ఇరుకిరుగ్గా కూర్చోలేక నలిగి ఊపిరాడక చచ్చిపోతానని భయం.

## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా:**

**నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,**
**లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.**
sunmagvaartha@gmail.com

సింగిల్ పేజీ కథ

# అదేదో సామెత చెప్పినట్టు..

**సరిత** ఓ గృహిణి. గడుసు అమ్మాయి. ఇద్దరూ ఇద్దరే అన్నట్లుగానే ఉంటారు ఆమె భర్త, కొడుకు. ఆఫీసుకు త్వరగా తెమలరాయే. హమ్మయ్య ఎలాగో డైనింగ్ టేబుల్ దగ్గరకు చేరారిద్దరూ. అమ్మో! ఆఫీస్‌కి లేట్ అయ్యింది నేవెళ్లాలి అని రఘు అంటుంటే ఆపి- తినేసి వెళ్లమన్నాగా. లేకపోతే సరిత చేసిన వంట "బూడిదలో పోసిన పన్నీరైపోదు". అందుకు కాదులెండి వచ్చే ఆదివారం పెళ్లిరోజు కదా, ఇప్పట్నుంచే శ్రీవారిని కాకా పట్టే ప్రయత్నంలో ఇదొక్కటి కాబోలు "ఆడవారి నోట్లో ఆవగింజ నానదు అన్నట్లు" రఘు టిఫిన్ తింటుండగా మొదలెట్టింది సరిత 'వచ్చే వారం పెళ్లిరోజు కదా! నాకేమి ఇస్తారు?' అని ఉత్సాహం ఆపుకోలేక అడిగేసింది సరిత.

నాకు ఓ మంచి పట్టుచీరె కొనిస్తారా? నా పుట్టిన రోజుకు కూడా ఏమి తీసియ్యలేదు. ఆ రోజు నా ఏడుపు మొఖం చూసి గుడికి తీసుకెళ్లి తూతూ మంత్రంలా జరిపించారు. నేను ఏది అడిగినా 'చెవిటోడి ముందు శంఖం ఊదినట్టేగా'. 'ముందొచ్చిన చెవులకన్నా వెనుకొచ్చిన కొమ్ములకు విలువ' అన్నట్లు మన అబ్బాయి చింటు బర్త్‌డేకు కేకు కోయించి, హోటల్‌కి తీసుకెళ్లి రాత్రికి ఓ సినిమా చూపించి చాలా హంగామా చేసారు. 'చాదస్తపు మొగుడు చెబితే వినడు గిల్లితే ఏడుస్తాడు' అన్నట్లు వుంది మీ వ్యవహారం. నా పాటికి నేను వాగుతున్నా 'దున్నపోతు మీద వాన కురిసినట్లు'గా ఉండారే?' అంటూ వాపోయింది సరిత.

టిఫిన్ తిన్నాక ప్లేట్‌లో చేతులు కడుగుతూ రఘు సరితతో "సరితా! 'చిత్తం శివుని మీద, భక్తి చెప్పుల మీద' అన్న విధంగా నాకు టిఫిన్ పెట్టి ఇంకా పెట్టేదా? తింటారా? అని అడగకుండా నీ పాటికి నీవు మాట్లాడుతున్నావే, క్యారి బాక్స్ రెడీ అయిందా? లేదా? నేను ఆఫీసుకి వెళ్లాలా, వద్దా?" అని కోప్పడ్డాడు.

సరిత వెంటనే 'ఆడలేనమ్మ మద్దెలపై పడినట్లు' నాపై కోప్పడితే యెట్లా? నేనేమైనా నగలడిగానా. నాణ్యాలడిగానా? అయినా 'ఉన్న మాటంటే ఉలుకెక్కువలె' 'పిల్లోడు పుట్టాక నా పైన ప్రేమ తగ్గిందిలే అని గొణుగుతూ క్యారియర్ రఘు చేతిలో పెట్టి 'ఊరుకున్నంత ఉత్తమం లేదు, బోడిగుండంత సుఖం లేదు' అయినా అనవసరంగా నిన్ను అడిగా! అంటూ లోనికి వెళ్లిపోయింది సరిత.

రఘు వెంటనే సరిత వెనకాలే లోపలికి వెళ్లి సరితతో "ఓ వెర్రిదానా! నీపై ప్రేమ తగ్గలేదే. నా జీతం అంతంత మాత్రమే. 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుంది' అన్నట్లుగా, 'ఎంత చెట్టుకు అంత గాలి' అన్నట్లు ఖర్చు పెట్టుకోవాలిగానీ అప్పు చేసి పప్పుకూడు అవసరమా? అయినా 'ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్టు 'చిన్నపిల్లోడితో నాకేంటి పేచి, నువ్వు అర్థం చేసుకొంటావని అనుకున్నా. చేసేది సర్కారీ ఉద్యోగమైనా నెలాఖరికి ఖర్చులు పోను జీతం 'ఇసుకలో నూనె పిండి నంత'గా మిగిలేది అని తెలుసుగా. సరితా నీవు పట్టుచీరె కట్టాలా? వంద రూపాయల చీరెలోనైనా నీవు అందంగా ఉంటావు అంటూ రఘు సర్ది చెప్పాడు.

దానికి సరిత వెంటనే "శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలు' అని ఇలా పొగడ్తలతో అసలు విషయం దాటెయ్యక 'అడిగేవాడికి చెప్పేవాడు లోకువ' అని నాకు చీర వద్దు ఏమీ వద్దులే, పిల్లోడ్ని బడిలో వదిలి మీరు ఆఫీసుకి బయలుదేరండి. ఆఫీసుకు ఆలస్యం అయితే మళ్లీ నా పైనే అరుస్తారు. 'ఎముక లేని నాలుక కదా ఎన్నయినా అంటుంది'లే అంటూ నిష్టూరపోయింది.

> "ఆడవారి నోట్లో ఆవగింజ నానదు అన్నట్లు" రఘు టిఫిన్ తింటుండగా మొదలెట్టింది సరిత "ఏమండోయ్! వచ్చే వారం పెళ్లిరోజు కదా! నాకేమి ఇస్తారు?" అని ఉత్సాహం ఆపుకోలేక "చెవిలో జోరీగ"ల నస పెడుతూ అడిగేసింది సరిత.

రఘు దానికి 'రెడ్డొచ్చె మొదలెత్తుకో' అన్నమాదిరి మళ్లీ మొదటికే వస్తున్నావు. 'కాళ్లకేస్తే మెడకు, మెడకేస్తే కాలికేస్తున్నావు. ఏమన్నా అందామంటే 'తిట్టబోతే అక్కబిడ్డ, కొట్టబోతే వేకటి మనిషి' అని ఈ పంచాయితి ఏదో సెలవురోజు పెట్టుకోక ఇలా ఆఫీస్‌కి వెళ్లేటప్పుడు ఈ నిష్టూరాలు ఏంటి" అన్నాడు.


ఆ వెంటనే సరిత అయినా మీరేమో 'కడుపే కైలాసం, ఇల్లే వైకుంఠం' మాదిరి ఇంట్లో వుంటే టీ.వి. లేకపోతే నిద్ర. కాసేపు పిల్లాడితో కాలక్షేపం, నా గురించి ఆలోచించరే! అడిగితే ఏమో నిష్టూరాలు అంటారు. అయినా నాకేమి తీసీయవద్దు అన్నాగా! మీరు ఎంచక్కా ఆఫీస్‌కి వెళ్లండి" అంది సరిత.


రఘు దానికి ఇంతదాక వచ్చింది కాబట్టి నీకో విషయం చెప్పాలి అంటూ ముసిముసి నవ్వులు నవ్వుతూ సరిత దగ్గరకు వచ్చి "సరితా! నీవు అలకలోను భలే అందంగా ఉన్నావే. నీకు చీరె కాదు బంగారపు ఉంగరమే కొన్నా. పెళ్లిరోజుకు సర్‌ప్రైజ్ ఇద్దామనుకున్నా. నీ పుట్టిన రోజుకే ఇద్దామనుకుంటే డబ్బు సర్దుబాటు కాలేదు. అందుకే పెళ్లిరోజుకు ఇస్తున్నా! కానీ నీ అలక వల్ల ఉంగరం విషయం ఇప్పుడే బయట పడింది" అని రఘు చెబుతున్నాడేగానీ సరితకు మాత్రం బంగారపు ఉంగరం అన్న మాట దగ్గరే చెవులు పనిచేయడం ఆగినట్లున్నాయేమో!


'మనసుంటే మార్గం వుంది' అని నిరూపించిన తన భర్తను చూస్తూ 'అనుకున్నదొక్కటి, అయ్యిందొక్కటిలాగా' సరితకు ఆశ్చర్యం, ఆనందంలో ఉండగా- రఘు కొడుకు చింటూని తీసుకొని బయటకు బయలుదేరారు. సరిత చీరె చాలనుకొంటే- తన భర్త ఉంగరం ఇస్తానని చెప్పగానే తన భర్త ప్రేమను గుర్తించలేకపోయినం దుకు బాధపడుతూనే 'తంతే బూరెల గంప'లో పడ్డట్లుగా వుంది అనుకొంటూ ఈ ఆనంద విషయం 'కళ్యాణమొచ్చినా కక్కొచ్చినా ఆగదు' అన్న తీరులో వెంటనే పక్కింటి పంకజం ఆంటీకి చెప్పేందుకు 'లేడికి లేచిందే పరుగు' అన్నట్లుగా పరుగు పరుగున వెళ్లింది సరిత.

**- అమృత జ్యోత్స్న**

ఈ వారం 'కార్టూన్స్'


ఉప్పల్ ఫ్లై ఓవర్ తప్ప...!


సినిమా మొత్తం మీ జూస్ తోనే లాగించేస్తాం..
మీరు ఒక్క రెండు గంటల టైమిస్తే చాలు...!!
నిర్మాత
Zakir...


మీ మీ సబ్జెక్టుల్లో ఎంత మంది పిల్లలు ఫెయిల్ అయ్యారో.. అన్నేసి గంటలు గోడ కుర్చీ వేయండి..!!
హెడ్మాస్టర్
Zakir...



పర్యాటకుల కోసమే నిర్మించిన ఈ ఇళ్లు చైనాలోని గ్వాంగ్జిన్ జిల్లా వాంగ్జియన్ లోయలో ఉన్నాయి. ఈ కుటీరాలను చేరాలంటే నడక మార్గమే శరణ్యం. కొండల మధ్య ఊయల వంతెన మీద నడక మరిచిపోలేని జ్ఞాపకంగా మిగిలిపోతుంది. చైనా పర్యటనకు వెళ్లినప్పుడు ఎంచక్కా మీరూ ఇక్కడే బస చేయవచ్చు.



